ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు

సోమవారం 16 జూన్ 2025



గాంధీబొమ్మ కూడలిలో రోడ్డుపై వర్షపు నీరు

వర్షం కురిసి.. ఆహ్లాదం పంచి..

పగలంతా ప్రచండుడి భగభగలతో అల్లాడిన నగరవాసులు ఆదివారం సాయంత్రం కురిసిన కొద్దిపాటి వర్షానికి సేదతీరారు. ఉదయం నుంచి ఎండకుతోడు ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ఆ తర్వాత సాయంత్రం వీచిన చల్లని గాలులు ఆహ్లాదం పంచాయి. కొద్దిసేపటికే మోస్తరు వర్షం కురవడంతో తడారిన నేలకు ఉపశమనం కలిగించినట్టు అయ్యింది. మరోవైపు వీఆర్సీ సెంటర్, ట్రంకురోడ్డు, గాంధీబొమ్మ కూడలి తదితర ప్రాంతాల్లో రోడ్లపై నీళ్లు నిలవడంతో నగరవాసులు ఇబ్బందులు పడ్డారు.



వహబ్‌పేటలో రోడ్డుపై నీరు నిలవడంతో పాదచారుల అవస్థలు



ఉదయగిరి : నర్రవాడలోని వెంగమాంబ ఆలయంలో పసుపు దంచుతున్న మహిళలు

నర్రవాడలో ఉత్సవ సంబరం

- ప్రారంభమైన వెంగమాంబ బ్రహ్మోత్సవాలు
- వలస వాసుల రాకతో గ్రామాల్లో సందడి



ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన నర్రవాడలో వెలసి ఉన్న శ్రీవెంగమాంబ పేరంటాలమ్మ బ్రహ్మోత్సవాలు ఆదివారం అంకురార్పణతో వైభవంగా ప్రారంభమయ్యాయి. వెంగమాంబ వంశస్తులైన పచ్చవ కుటుంబ సభ్యులు అమ్మవారికి పసుపు, కుంకుమ తీసుకొచ్చి ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. వేదపండితులు అమ్మవారిని పుష్పాలంకరణతో విశేషంగా అలంకరించారు. వేదపండితులు భక్తిశ్రద్ధలతో హోమాలు నిర్వహించారు. కలశాలను మంగళవాయిద్యాల నడుమ అమ్మవారి సన్నిధికి చేర్చారు. భక్తులు తరలివచ్చి నియమనిష్ఠలతో పొంగళ్లు నిర్వహించి అమ్మవారికి నైవేద్యం సమర్పించి భక్తులకు పంచిపెట్టారు. సంతానం లేని మహిళలు అమ్మవారి దగ్గర వరపడ్డారు. చిన్నారులు చేసిన నృత్యాలు అలరించాయి.

- వివరాలు 8లో..

రేపటి నుంచి గురువాయురప్పన్ బ్రహ్మోత్సవాలు

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని అయ్యప్ప గుడి ప్రాంగణంలోని మహాలక్ష్మీ, గోదా సమేత గురువాయుర్ మహావిష్ణు ఆలయంలో మంగళవారం నుంచి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తు న్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. ఆలయ కమిటీ అధ్యక్షుడు గూడల శేషగిరిరావు, కార్యదర్శి కత్తుల వెంకటరత్నం, కోశాధికారి గడ్డం రత్నయ్య ఆదివారం ఆలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. బ్రహ్మోత్సవ కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ నెల 22వతేదీ ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు. భద్రాచలం సీతారామస్వామి ఆలయ అర్చకుడు ఇళ్ళవలి కొండూమూరు స్థల సాయి స్వామి ఆధ్వర్యంలో ఉత్సవాలు జరుగుతాయని పేర్కొన్నారు. భక్తులందరూ తరలిరావాలని కోరారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు బీ శ్రీకాంత్‌రెడ్డి, పీటీ జగన్నాథం, కత్తి మోహన్‌రావు, రమణయ్య, కేజీ శంకరన్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'ఆడిట్' గాడినపడేనా!?

కీలక శాఖలో తిష్ఠ వేసిన ఉద్యోగులు ● తాజా బదిలీల్లో భారీగా స్థానచలనం ● సొంత జిల్లా నుంచి డీపీవో బదిలీ

పంచాయతీలు, మున్సిపాలిటీలు, మార్కెటింగ్ కమిటీలు, దేవాలయాలు వంటి వ్యవస్థల్లో ఆదాయం, ఖర్చుల పర్యవేక్షణలో ఆడిట్ శాఖ పాత్రం కీలకం. ఇంతటి బాధ్యతాయుతమైన శాఖలో ఏళ్ల తరబడి అధికారులు, ఉద్యోగులు పాతుకుపోవడం, వీరిలో మూడొంతుల మంది సొంత జిల్లా వారు కావడంతో అవినీతికి అడ్డులేకుండా పోయింది. మరీ ముఖ్యంగా వైసీపీ హయాంలో రూ.కోట్ల ప్రజాధనం పక్కదారి పట్టినా ఆడిట్ అధికారులు గుర్తించలేకపోయారు. ఈ అక్రమాల్లో వారికీ భాగమున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ తరుణంలో జిల్లా ఆడిట్ శాఖ ప్రక్షాళనకు ప్రభుత్వం పూనుకుంది.

నెల్లూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : ఏళ్ల తరబడి పాతుకుపోయిన ఆడిట్ శాఖలోని అధికారులు, ఉద్యోగులను కదిలించింది. తాజాగా జరిగిన బదిలీల్లో మూడొంతుల మంది జిల్లా నుంచి బదిలీ అయ్యారు. ప్రత్యేక పరిస్థితుల్లో మినహా సాధారణంగా జిల్లాస్థాయి పోస్టుల్లో సొంత జిల్లాకు చెందిన వారు ఉండరు. కానీ ఇప్పటివరకూ నెల్లూరు జిల్లాకు చెందిన వారే జిల్లా ఆడిట్ అధికారిగా పని చేస్తున్నారు. ఈయనకు తాజా బదిలీల్లో ప్రభుత్వం స్థానచలనం కల్పించింది. అలానే జిల్లాలో ఆరుగురు అసిస్టెంట్ ఆడిట్ అధికారులు ఉడగా, ఏకంగా ఐదుగురు బదిలీ అయ్యారు. 26 మంది సీనియర్ ఆడిటర్లలో 17 మంది, పది మంది జూనియర్ ఆడిటర్లలో ఇద్దరికి స్థానచలనం కలిగింది. మరి ఇకనైనా ఆడిట్ శాఖ గాడినపడేనా? పంచాయతీలు, దేవాలయాల్లో జరుగుతున్న అవినీతికి అడ్డుకట్ట వేసేనా? అన్న చర్చ నడుస్తోంది.

● బాధ్యులపై చర్యలేవి!?

పంచాయతీలు, దేవాలయాల్లో ఆడిట్ శాఖ అధికారులు నిర్వహించే ఆడిట్ చాలా కీలకమైనది. ప్రభుత్వం, ఇతర మార్గాల నుంచి వచ్చే నిధులు, ఖర్చులు నిబంధనల ప్రకారం జరిగాయా.. లేదా..? అన్నది ఆ శాఖ చూడాలి. ప్రజాధనం దుర్వినియోగం కాకుండా కాపాడటమే ఈ శాఖ కర్తవ్యం. కానీ జిల్లాలో ఆ పరిస్థితులు లేకుండా పోయాయి. ఆడిట్ అధికారులు ఏటా ఆడిట్ నిర్వహించి అంతా పక్కాగా ఉందని నివేదికలు ఇచ్చారు. అయితే ఆ పంచాయతీలు, దేవాలయాల్లో రూ.కోట్ల ప్రజాధనం దుర్వినియోగమైనట్లు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. మరి ఈ విషయాలు నాడు ఆడిట్ అధికారులు ఎందుకు గుర్తించలేకపోయారంటే సమాధానం దొరకడం లేదు. ఇటీవల మేజర్ పంచాయతీల్లో జరిగిన రూ.కోట్ల అవినీతి ఫలితంగా పంచాయతీ కార్యదర్శులు వరుసగా సస్పెండ్ అవుతూ వస్తున్నారు. ఈ క్రమంలోనే ఆయా పంచాయతీల్లో ఆడిట్ చేసిన ఆడిట్ అధికారులపైనా చర్యలు తీసుకోవాలని పంచాయతీ రాజ్ కమిషనర్ సూచించారు. కానీ ఆడిట్ శాఖ ఉన్నతాధికారులు మాత్రం తమకేమీ పట్టదన్నట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో తప్పు చేసినా ఏమీ కాదులే అన్న ధీమాతో ఆడిట్ శాఖలోని అవినీతి అధికారులు, ఉద్యోగులు దర్జాగా తిరుగుతున్నారు.

● సర్వీస్ రిజిస్టర్ ఏమైంది!?

జిల్లా ఆడిట్ కార్యాలయంలో ఓ అసిస్టెంట్ ఆడిట్ అధికారి సర్వీసు రిజిస్టర్ కనిపించడం లేదు. ఇది జరిగి మూడు నెలలు గడిచినా ఇంత వరకూ బాధ్యులపై కనీస చర్యలు తీసుకోలేదు. దీనిని బట్టే జిల్లా ఆడిట్ శాఖలో పరిస్థితులు ఏ విధంగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. కాగా ఈ రిజిస్టర్ పోగొట్టిన ఉద్యోగికే మళ్లీ కీలకమైన పెన్షన్ల సీటు ఇచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతుండడం గమనార్హం. ఇక కొందరు ఉద్యోగులు సంపాదనకు అలవాటు పడి జిల్లాను వదలనంటున్నారు. ప్రభుత్వం బదిలీ చేసినా.. దొడ్డిదారిలో డిప్యుటేషన్ పేరుతో మళ్లీ జిల్లాలోనే తిష్ఠ వేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది.

హమ్మయ్య!

ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియ పూర్తి ● 2 రోజుల్లో విధుల్లో చేరికలు



ఉపాధ్యాయుడికి బదిలీ ఉత్తర్వులు అందచేస్తున్న డీఈఓ బాలాజీరావు

నెల్లూరు (విద్య), జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ ఉద్యోగోన్నతులు, బదిలీల ప్రక్రియ ఆదివారం పూర్తయింది. ఇప్పటికే ఉద్యోగోన్నతులు, బదిలీలు పొందిన వారికి ఉత్తర్వులు జారీ చేయగా తాజాగా బదిలీ అయిన సెకండరీ గ్రేడ్ టీచర్లకు ఉత్తర్వులు అందుతున్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. ప్రభుత్వం వెబ్ కౌన్సెలింగ్ ఆధారంగా బదిలీలు చేపట్టాలని నిర్ణయించిన మేరకు ఉద్యోగోన్నతులు, ఎస్ఏల బదిలీలను చేపట్టి ఉత్తర్వులు అందచేశారు. అయితే ఎస్‌జీటీలకు మాత్రం మాన్యువల్‌గా కౌన్సెలింగ్ చేపట్టాలని పట్టుబట్టడంతో ఈ ప్రక్రియ కొంత ఆలస్యంగా ప్రారంభమై పూర్తి చేశారు. బదిలీ అయిన వారంతా రెండు రోజుల్లో విధుల్లో చేరనున్నారు.

● 6,106 మంది దరఖాస్తు

జిల్లాలో ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించి 6,106 దరఖాస్తులు వచ్చాయి. మొత్తం ప్రక్రియను ఈ నెల 11వతేదీ నాటికి పూర్తిచేసేలా అధికారులు కసరత్తు చేసినా అభ్యంతరాలు, వివాదాల కారణంగా ఆదివారానికి పూర్తయింది. మొత్తం దరఖాస్తుల్లో గ్రేడ్-2 హెచ్ఎంలు 139, లాంగ్వేజ్ పండిట్ విభాగంలో హిందీ 12, సంస్కృతం 1, తెలుగు 73, ఉర్దూ 2 కలిపి 88 దరఖాస్తులు అందాయి. అలాగే ఫిజికల్ ఎడ్యుకేషన్ 26, ప్రాథమిక పాఠశాలల హెచ్ఎంలు 82, స్కూల్ అసిస్టెంట్స్ లాంగ్వేజెస్ విభాగంలో ఇంగ్లీష్ 418, హిందీ 270, తెలుగు 400, ఉర్దూ 7, నోసబ్జెక్ట్ 1 కలిపి 1096 మంది, స్కూల్ అసిస్టెంట్ నాన్ లాంగ్వేజెస్ విభాగంలో బయలాజికల్ సైన్స్ 321, మ్యాథ్స్ 566, ఫిజికల్ ఎడ్యుకేషన్(పీడీ) 141, ఫిజికల్ సైన్స్ 381, సోషల్ 327, స్పెషల్ ఎడ్యుకేషన్ 12 కలిపి 1748 మంది, సెకండరీ గ్రేడ్ టీచర్లు 2,927 మంది మొత్తం 6,106 దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. ప్రత్యేక బృందాలు వీటిని పరిశీలించి తుది జాబితాలను విడుదల చేసి కౌన్సెలింగ్ నిర్వహించారు.

● ఫిర్యాదులు ఉంటే..

బదిలీ కౌన్సెలింగ్‌లపై ఏదైనా ఫిర్యాదులు ఉంటే మూడు రోజుల్లో అందచేయాలని డీఈఓ బాలాజీ రావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా విద్యా శాఖ అధికారి ఆదేశాలకు వ్యతిరేకంగా అప్పీల్ చేయదలచుకుంటే రీజనల్ స్థాయి కమిటీ అయిన ఆర్జేడీకి, ఆర్జేడీకి వ్యతిరేకంగా అయితే రాష్ట్రస్థాయి కమిటీ అయిన పాఠశాల విద్యా కమిషనర్‌కు అప్పీల్ చేయాలని తెలిపారు. అప్పీల్‌ను 15 రోజుల్లో పరిష్కరించి నిర్ణయాలు తీసుకుంటారని పేర్కొన్నారు. ఇతర చట్టపరమైన పరిష్కారాల కోసం వెళ్లే ముందు అన్ని స్థాయిల్లో అప్పీల్ నిబంధనలను ఉపాధ్యాయులు పాటించాలని, లేకుంటే చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

● 4,172 మందికి స్థానచలనం

జిల్లావ్యాప్తంగా 6,106 మంది దరఖాస్తు చేసుకోగా వీరిలో 4,172 మందికి స్థానచలనం కలిగింది. జిల్లాలో పనిచేస్తున్న గ్రేడ్-2 హెచ్ఎంలకు 103 మంది బదిలీలు నిర్వహించి ఉత్తర్వులు అందచేశారు. ఈ స్థానాల్లో ఖాళీ అయిన వాటికి అర్హులైన స్కూల్ అసిస్టెంట్ల నుంచి దరఖాస్తులు స్వీకరించి జడ్పీ మేనేజ్‌మెంట్‌లో 89 మందికి, మున్సిపాలిటీలో 4 కలిపి మొత్తం 93 మందికి ఉద్యోగోన్నతి కల్పించారు. అలాగే ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులుగా అర్హులైన 82 మంది దరఖాస్తు చేసుకోగా వీరికి కూడా కౌన్సెలింగ్ నిర్వహించి 81 మందికి ఉద్యోగోన్నతి కల్పించారు. మొత్తం మీద 174 మందికి ఉద్యోగోన్నతి కల్పించినట్లు డీఈఓ బాలాజీరావు తెలిపారు. వీరితోపాటు ఎస్‌జీటీ తెలుగు 2074 మంది, ఉర్దూ 54 మంది, లాంగ్వేజ్‌పండిట్‌లు 88 మంది, స్కూల్ అసిస్టెంట్ లాంగ్వేజ్ 545 మంది, నాన్ లాంగ్వేజెస్ 1134 మందికి బదిలీలు పూర్తయ్యాయి.



సోమశిలలో నీరు నిల్వ

అనంతసాగరం జూన్ 15 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయంలో 37.940 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి ఆదివారం 97 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. పెన్నా డెల్టాకు 3,850, ఉత్తర కాలువకు 375, దక్షిణ కాలువకు 700 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

నేడు కోనలో యోగాంధ్ర

రాపూరు, (ఆంధ్రజ్యోతి) : పర్యాటక శాఖ ఆధ్వర్యంలో సోమవారం పెంచలకోనలో మెగా యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ ఉప కమిషనర్ పొరెడ్డి శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్, వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, అధికారులు పాల్గొంటారని తెలిపారు.

'సార్.. క్యూలైన్‌లో దర్శనం చేసుకోవాలంటే చాలా ఆలస్యం అవుతుంది. ఎంతోకొంత నాకు ఇవ్వండి. వీఐపీ దర్శనం చేయిస్తా. ఆలయ మర్యాదలూ ఉంటాయి.' మాలకొండ క్షేత్రంలో కొంతమంది తాత్కాలిక ఉద్యోగుల తీరిది. వీరేకాదు. రాజకీయ నాయకులు, అధికారులూ తమ అనుచరులను, బంధువులను ఇష్టానుసారం వీఐపీ క్యూలైన్లలో స్వామివారి దర్శనానికి పంపుతున్నారు. దీనివల్ల ఆలయ ఆదాయానికి గండపడటమేగాక సాధారణ భక్తుల తీవ్ర ఇబ్బందిగా మారింది.



మాలకొండలో లక్ష్మీనృసింహస్వామి దర్శనం కోసం వీఐపీ క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

టికెట్ వద్దండి.. మాకిస్తే చాలండి!

- వీఐపీ దర్శనం చేయిస్తాం
- మాలకొండలో కొంతమంది సిబ్బంది తీరిది
- అధికార, రాజకీయ నాయకులదీ అదే తీరు
- ఆలయ ఆదాయానికి భారీగా గండి

వలేటివారిపాలెం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : మాలకొండలోని లక్ష్మీ నృసింహ స్వామి ఆలయంలో కాంట్రాక్టు ప్రాతిపదికన 109 మంది సిబ్బంది ఉన్నారు. నెలలో 4 శనివారాలు మాత్రమే వీరు పని చేస్తారు. ఇందుకుగాను ఒక్కొక్కరికి రూ. 3500 చొప్పున ఇస్తారు. వారంలో శనివారం మాత్రమే తెరిచే ఈ ఆలయానికి భక్తులు భారీగా తరలివస్తారు. దీంతో స్వామివారి దర్శనం కోసం గంటల తరబడి క్యూలైన్‌లో వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. దీన్నే ఆసరాగా చేసుకుని తమ చేతివాటం ప్రదర్శిస్తున్నారు. అంతసేపు క్యూలైన్‌లో వేచి ఉండలేనివారు తాత్కాలిక సిబ్బంది అడిగినంత ఇచ్చి టికెట్ లేకుండానే నేరుగా వీఐపీ దర్శనం ద్వారా సకల మర్యాదలు చేస్తారు. దీంతో ఆలయ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. మరోవైపు దేవుడి హుండీలో పడాల్సిన భక్తుల కానుకలు కూడా గుమాస్తాల జేబుల్లోకి వెళ్తున్నాయి. అక్కడే పనిచేసే తాత్కాలిక సిబ్బంది కొందరు తమ విధులను పక్కన పెట్టి ఇదే పనిలో ఉన్నారు. వీళ్లతోపాటు భద్రతా సిబ్బంది కూడా ఇదే పనిలో ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక రాజకీయ ద్వితీయ శ్రేణులు కూడా తమ అనుచరులను దర్శనం టిక్కెట్లు లేకుండానే భక్తులను వీఐపీ క్యూలైన్‌లో పంపిస్తున్నారు. వీరేగాక అధికారులు, వారితో వచ్చే అనుచరులు టికెట్ లేకుండానే దర్శనానికి వెళ్తున్నారు. దీంతో ఆలయ ఆదాయానికి వేలల్లో గండిపడుతోంది. ఇలా దాదాపు వెయ్యి మందికిపైగా టికెట్ లేకుండానే స్వామివారి దర్శనానికి వీఐపీ క్యూలైన్‌లో వెళుతున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంపై అప్పుడప్పుడు క్యూలైన్‌లో ఉన్న సాధారణ భక్తులు సిబ్బంది తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆలయ అధికారులు స్పందించి తాత్కాలిక సిబ్బందిపై నిఘా పెట్టి ఆలయ ఆదాయానికి గండిపడకుండా చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

● భక్తులపై కొండ తేనెటీగలు దాడి

మాలకొండకు వచ్చిన భక్తులపై శనివారం కొండ తేనెటీగలు దాడి చేశాయి. ఆ దాడిలో పలువురు గాయపడ్డారు. నరసింహస్వామి దర్శనం ముగించుకొని మహాలక్ష్మ అమ్మవారు దర్శనానికి చీలిన కొండ మెట్ల దారిలో భక్తులు వెళుతున్నారు. అమ్మవారి ఆలయ పక్కన రావిచెట్టుకు కొండ తేనెటీగల తేనెతుట్టె పెట్టి ఉంది. ఆ తేనెతుట్టెను కోతులు కదిలించడంతో కొండ తేనెటీగలు ఒక్కసారిగా భక్తులపై దాడి చేశాయి. దీంతో భక్తులు మెట్లమార్గంలో పడుతూ లేస్తూ పరుగులు పెట్టారు. దీంతో పలువురు కిందపడి గాయపడ్డారు. వీరికి ప్రథమ చికిత్స కేంద్రంలో చికిత్స చేశారు. రావిచెట్టుకు పెట్టిన తేనెటీగలు తుట్టెను సిబ్బంది తొలగించాలి. అయితే ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

1.77 లక్షల మందికి అన్నదాత సుఖీభవ

నెల్లూరు (వ్యవసాయం, ఆంధ్రజ్యోతి) : అన్నదాత సుఖీభవ పథకానికి జిల్లాలో 1.17 లక్షల మంది రైతులు ఈకేవైసీ చేయించుకున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి పి.సత్యవాణి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రైతు సేవా కేంద్రం ఇన్‌చార్జి వద్ద ఈకేవైసీ చేసిన రైతులు మాత్రమే పథకానికి అర్హులని పేర్కొన్నారు. కాబట్టి రైతులు తప్పనిసరిగా తమ ఆధార్ నెంబరుతో వారి భూమి, బ్యాంకు ఎన్‌పీసీఐ లింక్ జరగడంతోపాటు ఈకేవైసీ నమోదు చేసుకోవాలని సూచించారు. ఒక రైతు కుటుంబానికి సంవత్సరానికి రూ.20వేలు మూడు దఫాలుగా పీఎం కిసాన్‌తో కలిపి జమ చేయడం జరుగుతుందని తెలిపారు.

రొట్టెల పండుగకు విస్తృత ఏర్పాట్లు చేయండి!

దర్గాలో భారీస్థాయిలో ప్రార్థన మందిరం నిర్మాణం

అధికారుల సమీక్షలో మంత్రి నారాయణ

నెల్లూరు (సాంస్కృతికం) జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర పండుగ అయిన బారాషహీద్ దర్గాలో జరిగే రొట్టెల పండుగకు విస్తృత ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయన అధికారులను ఆదేశించారు. ఆదివారం కలెక్టరేట్‌లోని శంకరన్ హాలులో నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిలతో కలిసి రొట్టెల పండుగ ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. దర్గా అభివృద్ధికి సీఎం మంజూరు చేసిన రూ.5కోట్లతో ఈద్గా మైదానంలోని ప్రార్థనా మందిరంలో ఒకేసారి 20వేల మంది ప్రార్థనలు చేసుకునేలా నిర్మిస్తున్నట్లు చెప్పారు. అయితే, రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ఈ పనులను నుడా ద్వారా పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. ఇన్‌చార్జ్ కలెక్టర్ కార్తీక్, ఎస్పీ కృష్ణకాంత్‌లతో సమన్వయం చేసుకుంటూ ఏర్పాట్లు చేయాలని తెలిపారు.

● పనుల సాగదీతపై ఆగ్రహం

నగర సుందరీకరణలో భాగంగా అండర్ పాసులు, ఓవర్ బ్రిడ్జి, ఓవర్ హెడ్‌ట్యాంకు పనులు సంవత్సర కాలంగా కొనసాగడంపై సంబంధిత అధికారులపై మంత్రి నారాయణ మండిపడ్డారు. రాబోయే 45రోజుల్లో రంగులు వేసి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.



అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి నారాయణ, పక్కన నుడా చైర్మన్ కోటంరెడ్డి, ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్, ఎస్పీ కృష్ణకాంత్ తదితరులు

● త్వరలో టెండర్లు పిలుస్తాం..

రొట్టెల పండుగ సందర్భంగా నుడా ఆధ్వర్యంలో ప్రార్థనా మందిరం నిర్మాణానికి త్వరలో టెండర్లు పిలువుస్తామని నుడా చైర్మన్ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. త్వరగా ఈ ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభిస్తామన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్, మున్సిపల్, నుడా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	119
స్కిన్ చికెన్	214
స్కిన్‌లెస్	238

కోడిగుడ్ల ధర (100): 515

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9600
వెండి కిలో ధర	రూ. 109,300
వెండి ఒక గ్రాము	రూ.112.30

రాజకీయాలపై అవగాహన పెంచుకోవాలి : మాజీ ఎమ్మెల్సీ విఠపు

నెల్లూరు (వైద్యం), జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : రాజకీయాలపై ప్రతీ ఒక్కరు అవగాహన పెంచుకోవాలని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణం పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని ఎంవీఎస్ కల్యాణ మండ పంలో అవాజ్ కమిటీ జిల్లా కార్యదర్శి షేక్ రషీద్ ఆధ్వర్యంలో రాజకీయ శిక్షణ తరగతులు జరిగాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ముస్లింలు ఆర్థికంగా వెనుకబడి ఉన్నారని, ప్రభుత్వాలు వారిని పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. అవాజ్ కమిటీ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ రఫీ, మాజీ డిప్యూటీ మేయర్ మాదాల వెంకటేశ్వర్లు, కొండా ప్రసాద్, పెంచల నర్సయ్య, షేక్ నజీర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నెల్లూరు(హరనాథపురం), జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని వీపీఆర్ నివాసంలో ఆదివారం 39 మందికి రూ.34 లక్షల విలువచేసే ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అందచేశారు. కార్యక్రమంలో బుచ్చి మున్సిపల్ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, టీడీపీ నాయకుడు బెజవాడ వంశీకృష్ణారెడ్డి, జనసేన నాయకుడు గుడిహరి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మునిసిపల్ పాఠశాలల్లో వలంటీర్లను నియమించాలి

నెల్లూరు(విద్య), జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ మేనేజ్‌మెంట్లలోని అన్నీ పాఠశాలల్లో విద్యా వలంటీర్లను నియమించాలని ఆర్‌టీపీ అధ్యక్షకార్యదర్శులు షేక్ ఖాజా రహంతుల్లా, కోలా కిరణ్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆదివారం మంత్రి నారాయణకు వినతిపత్రం అందజేశారు. ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత లేకుండా ఉద్యోగోన్నతులు కల్పించడమే కాకుండా కార్పొరేషన్‌లోని మోడల్ ప్రైమరీ స్కూల్స్‌లో 34 హెచ్‌ఎం పోస్టులు మంజూరు చేయడం ఆనందంగా ఉందన్నారు. అయితే పెద్ద స్థాయిలో ఎస్‌జీటీలకు ప్రమోషన్లు ఇవ్వడంతో మోడల్, బేసిక్, ప్రాథమిక పాఠశాలల్లో టీచర్ల కొరత ఏర్పడిందని, దీన్ని దృష్టిలో ఉంచుకుని అవసరమైన చోట విద్యా వలంటీర్లను నియమించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై అధికారులతో మాట్లాడతానని మంత్రి సమాధాన మిచ్చారు.

పోలీస్ క్రికెట్ జట్టుపై జర్నలిస్టుల విజయం

నెల్లూరు(విద్య), జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : నిత్యం పని ఒత్తిడితో సతమతమయ్యే పోలీసులు కాస్తంత ఆటవిడుపు కోసం జర్నలిస్టులతో క్రికెట్ మ్యాచ్‌లో తలపడ్డారు. ఆదివారం నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో నెల్లూరు రూరల్ సబ్ డివిజన్ పోలీస్ క్రికెట్ జట్టు, జేశాప్ జర్నలిస్టుల మ్యాచ్ జరిగింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న పోలీస్ జట్టు నిర్ణీత 12.1 ఓవర్లలో 68 పరుగులకే ఆలౌట్ అయ్యింది. కొడవలూరు సీఐ సురేంద్రబాబు 36 పరుగులు సాధించారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన జర్నలిస్టు జట్టు 7.4 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 71 పరుగులు సాధించి విజేతగా నిలిచింది. జర్నలిస్టు జట్టులోని సాయి 39 పరుగులతో జట్టు విజయానికి కృషి చేశారు. బుచ్చి సీఐ శ్రీనివాసులు రెడ్డి, నెల్లూరు రూరల్ ఎస్ఐ ప్రసాద్‌రెడ్డి, జేశాప్ నెల్లూరు సభ్యులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

బాల పురస్కారాల ప్రదానం

నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి) : నాన్న దినోత్సవం సందర్భంగా ఆదివారం నగరంలోని శ్రీ వేంకటేశ్వర విద్యాలయంలో బాల పురస్కారాల కార్యక్రమం జరిగింది. ప్రముఖ కార్టూనిస్టు మోపూరు రామ్‌శేషు కుమార్తె మోపూరు పావని స్మారకంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. బొద్దులూరు దీక్షిత (నాట్యం), ఝాన్సీ (సంగీతం), జీవన (చదువు), జ్యోత్స్న (ఆల్‌రౌండర్), హమీషా (క్రీడలు)కు పురస్కారాలు అందించి సత్కరించారు. జీ సుభద్రాదేవి, మోపూరు రామశేషు, ప్రశాంతి పాల్గొన్నారు.

ఘనంగా మంత్రి నారాయణ పుట్టినరోజు

● నగరంలో భారీగా వేడుకలు, సేవా కార్యక్రమాలు ● శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యేలు, నాయకులు

నెల్లూరు (వైద్యం), జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ జన్మదిన వేడుకలు ఆదివారం నగరంలోని పలు ప్రాంతాల్లో ఘనంగా జరిగాయి. టీడీపీ నాయకులు కేక్‌కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చారు. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, కంభం విజయరామిరెడ్డి, నుడా మాజీ చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్ తదితరులు మంత్రిని కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియచేశారు.

● నగరంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో నారాయణ జన్మదిన వేడుకలు జరిగాయి. మహిళా నేతలు 68 కిలోల కేక్‌ను ఏర్పాటు చేసి మంత్రితో కేక్ కట్ చేయించి మంత్రి దంపతులను సన్మానించారు. నవాబుపేట, వెంకటేశ్వరపురంలో టీడీపీ నాయకులు ఏర్పాటు చేసిన కేక్‌ను మంత్రి నారాయణ కట్‌చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, కార్పొరేషన్ కో ఆప్షన్ సభ్యుడు జమీర్, 53, 53 క్లస్టర్ ఇన్‌చార్జ్ జహీర్, 54వ డివిజన్ కార్పొరేటర్ షఫియా బేగం, 53వ డివిజన్ కార్పొరేటర్ సుజాత, ముజీర్, కువ్వారపు బాలాజీ, పాకాల పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

● ఎన్టీఆర్ నగర్‌లో జరిగిన వేడుకల్లో మంత్రి నారాయణ కేక్‌కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. టీడీపీ శ్రేణులు మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు. జర్మనీ దేశం హాంబర్గ్ నగరంలోని ఎన్ఆర్ఐ టీడీపీ శ్రేణులు మంత్రి నారాయణ జన్మదిన వేడుకలు నిర్వహించాయి. వేమిరెడ్డి శశిధర్, డాక్టర్ శివశంకర్ అధ్యక్షతన ఈ వేడుకలు జరిగాయి. తల్లపనేని విక్రమ్, పాకలపాటి దినేష్, దాసుగారి కిశోర్, అఖిల ప్రసన్న, దోళ్ల శ్రీకాంత్, శీలంనేని భరత్, మారెడ్డి ఉజ్వల, హాంబర్గ్ తెలుగు కమ్యూనిటీ అధ్యక్షుడు వడ్డాది శ్రీనివాస్, సభ్యుడు అంకారావు తదితరులు పాల్గొన్నారు.

● నారాయణ వైద్య విద్యా సంస్థల ఆధ్వర్యంలో మంత్రి పుట్టిన రోజు వేడుకలు జరిగాయి. నారాయణ సతీమణి పొంగూరు రమాదేవి కేక్‌కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. నారాయణ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులురెడ్డి, నారాయణ డెంటల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అజయ్ రిజినాల్డ్ మంత్రికి శుభాకాంక్షలు తెలియచేశారు. వివిధ విభాగాల అధిపతులు, ఆపరేషన్ హెడ్ రామారావు, ముని శంకర్, ఏసీ శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● **రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో..**

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూన్ 15 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కార్యాలయంలో ఆదివారం రాత్రి మంత్రి పొంగూరు నారాయణ జన్మదిన వేడుకలు నిర్వహించారు. మంత్రి భారీ కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆశీస్సులు, మంత్రి నారాయణ సహకారం మరువలే నిదన్నారు. మంత్రి జన్మదినం సందర్భంగా గురు కిరణ్‌సింగ్ అనే విద్యార్థి ఎంత వరకు చదువుకుంటే అంత వరకు సొంత నిధులతో చదివిస్తానని ఎమ్మెల్యే ప్రకటించారు. ఈ వేడుకలకు జోరువానలోనూ భారీ సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

● **బోడిగాడితోటలో అన్నదానం**

నెల్లూరు (సాంస్కృతికం) జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : మంత్రి నారాయణ 68వ పుట్టిన రోజు సందర్భంగా 5వ డివిజన్ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి కే గంగాధర్ బోడిగాడితోట ప్రాంతంలో అన్నదానం చేశారు. ముఖ్య అతిథిగా నారాయణ విద్యాసంస్థల జీఎం వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి హాజరయ్యారు. భారీ కేక్ కట్ చేసి పేదలకు భోజనం వడ్డించారు. నగరంలో ఎక్కడికి వెళ్లినా ప్రజలు మంత్రి నారాయణ మీద ఎనలేని అభిమానం చూపిస్తున్నారని, వారందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే విజయరామిరెడ్డి, ఆర్యవైశ్య నాయకుడు ముక్కాల ద్వారకానాథ్, టీడీపీ నాయకులు లెక్కల వెంకరెడ్డి, దామవరపు రాజశేఖర్, దర్శి ప్రసాద్, బాల్‌రెడ్డి, శశి, ప్రసన్న, కరిముల్లా, పెంచలయ్య, కుమార్, రోసిరెడ్డి శ్రీరాములు, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

● మూలస్థానేశ్వర స్వామి ఆలయం వేద పండితులు, అర్చకులు మంత్రి నివాసానికి వెళ్లి నారాయణ దంపతులకు వేద ఆశీస్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయం ఈవో ఏవీ శ్రీనివాసులురెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

● నగరంలోని స్టోన్‌హౌస్‌పేటలో జిల్లా రైస్ కాన్వాసింగ్ ఏజెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటైన వేసవి మజ్జిగ చలివేంద్రానికి ఆదివారం మంత్రి నారాయణ పుట్టినరోజు సందర్భంగా టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి గాదంశెట్టి హేమంత్ దాతగా వ్యవహరించారు. ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శి పేగు షణ్ముఖరావు, భవనాశి సురేష్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

● **ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి శుభాకాంక్షలు**

నెల్లూరు(హరనాథపురం,ఆంధ్రజ్యోతి) : కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆదివారం మంత్రి నారాయణ క్యాంపు కార్యాలయానికి వెళ్లి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం లో నాయకులు చెముకుల కృష్ణ చైతన్య, బత్తుల హరికృష్ణ, రావెళ్ల వీరేంద్ర నాయుడు, బెజవాడ వంశీ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మంత్రిని సత్కరిస్తున్న డాక్టర్ పోకల రవి

డెల్టా ఆసుపత్రిలో వేడుకలు

నెల్లూరు (వైద్యం), జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని డెల్టా ఆసుపత్రిలో ఆ వైద్యశాల అధినేత డాక్టర్ పోకల రవి ఆధ్వర్యంలో ఆదివారం పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ జన్మదిన వేడుకలు జరిగా యి. కేట్ కట్‌చేసి అందరికీ పంచారు. బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఉద్యోగోన్నతి పొందిన 10 మంది ప్రధానోపాధ్యాయులకు మంత్రి నారాయణ జ్ఞాపికలు అందజేశారు. చలివేంద్ర ఏర్పాటు చేసి పాదచారులకు పులిహోర, దద్దోజనం పంపిణీ చేశారు. కమతం సుబ్బారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు చాట్ల నరసింహారావు, ఇండ్ల రాఘవేంద్రరావు, చదలవాడ హరిబాబు, ధర్మగిరి, నలిశెట్టి శ్రీధర్, జనసేన నాయకుడు గుణుకుల కిశోర్, సింగశెట్టి శ్రీరా మ్, పాపిశెట్టి జానకిరామ్, అడపా సూరిప్రకాష్, సుధా మాధవ్, పామూరి మధుసూదన్, సుధాకర్, లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ ఉన్నత పాఠశాల

23న పునః ప్రారంభం

● అడ్మిషన్లు ప్రారంభించిన మంత్రి నారాయణ



వీఆర్ హైస్కూల్లో అడ్మిషన్ల కోసం తరలివచ్చిన తల్లిదండ్రులతో మాట్లాడుతున్న మంత్రి నారాయణ

నెల్లూరు(విద్య), జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని వీఆర్ హైస్కూలు ఆధునీకరణ తర్వాత ఈ నెల 23న లాంఛనంగా పునఃప్రారంభిస్తున్నట్లు రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. ఆ పాఠశాలలో అడ్మిషన్ల ప్రక్రియను ఆయన ఆదివారం ప్రారంభించారు. తల్లిదండ్రుల నుంచి విశేష స్పందన లభించింది. మంత్రి మాట్లాడుతూ ఘన చరిత్ర కలిగిన వీఆర్ హైస్కూల్‌ను వైసీపీ ప్రభుత్వంలో నిర్వీర్యం చేసి మూసేశారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పునరుద్ధరించామని, ఈ విద్యా సంవత్సరం నర్సరీ నుంచి 9వ తరగతి వరకు ప్రారంభిస్తున్నామని, వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇంటర్ వరకు నిరుపేద విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందిస్తామని తెలిపారు. విద్యార్థులందరికీ ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్‌తో పాటు రవాణా సౌకర్యంగా కల్పిస్తామని చెప్పారు. నగరంలోని మునిసిపల్ పాఠశాలలను కూడా దాతల సహకారంతో ఇదే తరహాలో తీర్చిదిద్దుతామని మంత్రి ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, మునిసిపల్ కమిషనర్ నందన్, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్‌యాదవ్, నారాయణ సతీమణి రమాదేవి, టీడీపీ నాయకులు వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, టీ అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

● **నెల్లూరును నాశనం చేసిన వైసీపీ**

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట, ఆంధ్రజ్యోతి): గడిచిన ఐదేళ్లలో నెల్లూరు నగరాన్ని వైసీపీ సర్వనాశనం చేసిందని మంత్రి నారాయణ ఆగ్రహం వక్తం చేశారు. నగరంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం ఆయన పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. అల్లీపురం డంపింగ్ యార్డ్‌లో వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ వద్ద పనులను పరిశీలించారు. నవాబుపేట, వెంకటేశ్వరపురం ప్రాంతాల్లో పునరుద్ధరించిన పార్కులను ప్రారంభించారు. నగరంలోని 11వ డివిజన్ ఎన్‌టీఆర్ నగర్‌లో ఎన్టీఆర్ సుజల సురక్ష మంచినీటి ప్లాంట్లను లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తమ హయాంలోనే నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. మరో రెండేళ్లలో అమరావతి రాజధాని నిర్మాణాన్ని పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. అమరావతి నిర్మాణం వేగంగా జరుగుతుండటాన్ని జీర్ణించుకోలేక వైసీపీ దుష్ప్రచారం చేస్తోందని విమర్శించారు. తప్పు చేసిన వారు శిక్ష అనుభవించక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నందన్, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, టీడీపీ నగర అధ్యక్షుడు మామిడాల మధు, జిల్లా అధికార ప్రతినిధి కువ్వారపు బాలాజీ, పాకాల పెంచలయ్య పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు గాడ్ ఫాదర్ సాంబశివరావు

● వాత్సల్య ఆశ్రమంలో ఘనంగా ఫాదర్స్‌డే



సాంబశివరావును సన్మానిస్తున్న సుధాకర్ తదితరులు

నెల్లూరు(హరనాథపురం), జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : తల్లీతండ్రి లేని పిల్లలను చేరదీసి అన్నీ తానై విద్యాబుద్ధులు నేర్పుతూ, వారు జీవితంలో స్థిరపడేలా చేస్తున్న వాత్సల్య అనాథాశ్రమ నిర్వాహక కార్యదర్శి జీవీ సాంబశివరావు ఆ పిల్లలకు గాడ్‌ఫాదర్ వంటి వారని ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు అన్నారు. ఆదివారం నగరంలోని వాత్సల్యలో అనాథ పిల్లల మధ్య మానవసేవయే మాధవ సేవ సంస్థ ఆధ్వర్యంలో ఫాదర్స్ డే వేడుకలు నిర్వహించారు. ముందుగా సాంబ శివరావును సత్కరించారు. అనాథ పిల్లలకు సంస్కారవంతమైన విద్యను అందిస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అరవ పరిమళ, రఘునాథరాజు, శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జనసేన కిట్ల పంపిణీ

మనుబోలు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండేపల్లి గ్రామంలో జనసైనికులు క్రియాశీలక సభ్యత్వాల కిట్లను ఆదివారం అందజేశారు. మడమనూరుకు చెందిన ఆనంద్ ఆధ్వర్యంలో జనసైనికులు కిట్లను అందించి పార్టీ గురించి వివరించారు. జనసేనాని తీసుకుంటున్న నిర్ణయాలను, అభివృద్ధి, సేవా కార్యక్రమాలను తెలియజేశారు. ఖాదర్‌వల్లీ, జాకీర్, పెనుబాక మహేష్, సుధీర్, శరత్ పాల్గొన్నారు.

క్రికెట్ విజేత విఘ్నేశ్వర ఈవెంట్స్

పొదలకూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పొదలకూరు స్టేడియంలో జరుగుతున్న టీ10 క్రికెట్ టోర్నమెంటును విఘ్నేశ్వర ఈవెంట్స్ జట్టు గెలుచుకుంది. ఆదివారం విఘ్నేశ్వర ఈవెంట్స్, హోమ్ టీం మధ్య ఫైనల్ మ్యాచ్ జరిగింది. విఘ్నేశ్వర ఈవెంట్స్ జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. 10 ఓవర్లకు ఏడు వికెట్లకు 81 పరుగులు చేసింది. అనంతరం ఛేదనకు దిగిన హోం టీం 14 పరుగుల తేడాతో పరాజయం పాలైంది. విజేతకు రూ.20వేలు బహుమతిని విజ్ఞాన్ జూనియర్ కాలేజీ అధినేత కృష్ణ చేతుల మీదుగా అందజేశారు. రన్నర్స్‌గా నిలిచిన హోమ్ టీంకు రూ.10 వేలు బహుమతిని హరివిల్లు గార్డెన్స్, సిరి గార్డెన్స్ వారు అందజేశారు. బెస్ట్ బ్యాట్స్‌మెన్, బెస్ట్ బౌలర్‌కు కూడా బహుమతులు అందజేశారు. క్రీడలతోనే శారీరక, మానసికోల్లాసం కలుగుతుందని, క్రీడల్లో గెలుపోటములు సహజమని 'విజ్ఞాన్' అధినేత కృష్ణ అన్నారు. ఈ కార్యక్రమంలో విఘ్నేశ్వర ఈవెంట్స్ అధినేత వీరేంద్రబాబు, బాలచంద్ర, విష్ణు పాల్గొన్నారు.



విఘ్నేశ్వర ఈవెంట్స్‌కి బహుమతి అందజేస్తున్న స్పాన్సర్స్

సింహపురి సమితి సేవలు భేష్

● నగర మేయర్ స్రవంతి

నెల్లూరు (వైద్యం), జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : సింహపురి వైద్య సేవాసమితి విద్యా, వైద్య రంగాల్లోనే కాకుండా గిరిజనులకు సేవలు చేయటం అభినందనీయమని నగర మేయర్ స్రవంతి జయవర్ధన్ అన్నారు. నగరంలోని జయభారత్ ఆసుపత్రిలో ఆదివారం కేంద్ర ప్రభుత్వ గిరిజన మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాన్ని గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆసుపత్రి మేనేజర్ గురుప్రసాద్ మాట్లాడుతూ గిరిజన కాలనీల్లో ఆరోగ్య కార్డులు ఇస్తామని, వైద్య శిబిరాలు, ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో పొట్లూరి శ్రీనివాసులు, యాకసిరి వెంకటేశ్వర్లు, సుధాకర్‌రావు, మోహన్‌రావు, శ్రీనివాసులు, మురళి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండు నిర్వహణ ఇలాగేనా..?

ఆర్టీసీ అధికారులపై రీజనల్ చైర్మన్ ఆగ్రహం



ఫోన్‌లో ఆర్టీసీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సురేష్‌రెడ్డి

ముత్తుకూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ముత్తుకూరు ఆర్టీసీ బస్టాండ్ నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో అధికారులపై సంస్థ రీజనల్ చైర్మన్ సురేష్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ముత్తుకూరులోని ఆర్టీసీ బస్టాండ్‌ను స్థానిక బీజేపీ నాయకులతో కలిసి ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. బస్టాండ్‌లో విరిగిపోయిన కుర్చీలు, పెయింటింగ్ లేక వెలవెల బోతున్న గోడలను పరిశీలించారు. మరుగుదొడ్లు అధ్వా నంగా ఉండడం చూసి అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రయాణికులు వేచి ఉండేందుకు కనీస వసతులు లేకపోవడాన్ని గమనించారు. కంట్రోల్ రూమ్‌లో సమాచారం ఇచ్చేందుకు సిబ్బంది ఎవరూ లేకపోవడంతో వెంటనే ఆర్టీసీ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. అ ధిక ఆదాయం వచ్చే ముత్తుకూరు మార్గంలో బస్టాండ్ నిర్వహణ అధ్వానంగా ఉండడం ఏమిటని ప్రశ్నించారు. వెంటనే ప్రయాణికులకు వసతులు కల్పించాలని, బస్టాండుకు పెయింటింగ్ వేయించాలని ఆదేశించారు. నిర్వహణ తీరు మారకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. కాగా, ముత్తుకూరు- నెల్లూరు మార్గంలో కొత్త బస్సులు వేయాలని, వాకా డుకు బస్సుల సంఖ్యను పెంచాలని బీజేపీ నాయకులు సురేష్‌రెడ్డిని కోరారు. ఈ కార్యక్రమంలో కాకుటూరు రవీందర్‌రెడ్డి, వేళ్లపాలెం సంపత్‌రెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి, ఈపూరు శివ, ఈశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వెట్టిచాకిరీ చట్టరీత్యా నేరం : ఏఎస్ఐ



గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న ఏఎస్ఐ శ్రీహరి

తోటపల్లిగూడూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మహిళలు, బాలబాలికలతో వెట్టిచాకిరీ చేయించడం చట్టరీత్యా నేరమని యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఏఎస్ఐ శ్రీహరి తెలిపారు. మండలంలోని నరుకూరు గిరిజన కాలనీలో ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాలతో గిరిజనులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఎవరైనా బాల్య వివాహాలు జరిపితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాలికలతో అగౌరవంగా, అమర్యాదగా ప్రవర్తిస్తే పోక్సో, జువనైల్ జస్టిస్ చట్టాల కింద చర్యలు తీసుకుంటామని తెలిపారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా కాలనీవాసులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఏహెచ్‌టీయూ ఏఎస్ఐ డీ సతీష్, సిబ్బంది, టీవీఎస్ రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

బలిజలకు రిజర్వేషన్ పునరుద్ధరించాలని పాదయాత్ర



పాదయాత్రకు సంఘీభావం తెలుపుతున్న రాపూరు బలిజ కులస్థులు.

రాపూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): బలిజ, తెలగ, ఒంటరి, కాపు కులాలకు రిజర్వేషన్ కల్పించాలని సానా ప్రసాద్ అనే వ్యక్తి చిత్తూరు నుంచి అమరావతి వరకు పాదయాత్ర చేపట్టారు. ఈ పాదయాత్రలో భాగంగా రాపూరు చేరుకోవడం జరిగింది. ఈ సందర్భంగా పట్టణ బలిజలు అతనిని శాలువాతో సత్కరించి, సంఘీభావంగా అతనితో కొంతదూరం పాదయాత్ర చేశారు. ఆయన మాట్లాడుతూ కాపులు కోల్పోయిన రిజర్వేషన్‌ను పునరుద్ధరించాలని పాదయాత్రగా అమరావతి చేరుకొని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు కాపుల రిజర్వేషన్ మీద వినతి పత్రం ఇస్తానని తెలిపారు. కార్యక్రమంలో గజరా వేణు గోపాల్, గంగిశెట్టి వెంకటేశ్వర్లు, జల్లెల రాజేష్, తాటి శ్రీనివాసులు, గంధం శివ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ చెల్లాయపాళెం అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు

బుచ్చిరెడ్డిపాళెం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): చెల్లాయపాళెం టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా దండు వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం ఆ గ్రామ సర్పంచు రజనీకాంత్, నాయకులు మురళి, మల్లికార్జున, రాజే ష్, ధర్మయ్య తదితరులు గ్రామంలో వెంకటేశ్వర్లును సత్కరించి కేక్ కట్ చేసి, పంచిపెట్టారు.

● బుచ్చిరెడ్డిపాళెం : పట్టణంలోని ఎస్ఎస్ కల్యాణ మండపంలో ఆదివారం జరిగిన అంతర్జాతీయ యోగా దినోత్సవ దశాబ్ది ఉత్సవాలకు హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థకు చెందిన నెల్లూరు జోనల్ కోఆర్డినేటర్, ఎంజీబీ మాల్ అధినేత ఎంఆర్ గంగాధర్, ఆర్అండ్‌బీ ఎస్ఈ గంగాధర్ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు వెంకటేశ్వర్లు, ఎంఈఓ రత్నం, చైర్‌పర్సన్ సుప్రజ మురళి, ఎస్ఐ సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.

19న మంద కృష్ణ సన్మాన సభ

నెల్లూరు (సాంస్కృతికం) : వికలాంగుల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ పద్మశ్రీ అవార్డు అందుకున్న సందర్భంగా 19న హైదరాబాద్‌లో సన్మాన సభ జరుగుతుందని ఆ సమితి రాష్ట్ర అధ్యక్షుడు చిన్నసుబ్బయ్య యాదవ్ తెలిపారు.

రైతులు ఈకేవైసీ తప్పక చేయించుకోవాలి

● మండల వ్యవసాయ అధికారి శిరీష

తోటపల్లిగూడూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రైతులందరూ అన్నదాన సుఖీభవ పథకం ద్వారా లబ్ధి పొందడానికి తప్పని సరిగా ఈకేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి శిరీషా రాణి సూచించారు. ఆర్‌టీజీఎస్ వ్యాలిడేషన్ తర్వాత రికార్డ్స్‌లో ఈకేవైసీ చేయించుకోవడానికి రైతులు అర్హత పొందారని తెలిపారు. రైతు సేవా కేంద్రాల్లో గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి తప్పనిసరిగా ఈ నెల 20వతేదీ లోపల ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద అర్హులైన రైతుల ఖాతాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏడాదికి మూడు దఫాల్లో రూ.20వేలు జమ చేస్తాయని తెలిపారు.


అంకయ్య మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ విజేత రాపూరు రాయల్స్ జట్టు



విన్నర్‌గా నిలిచిన రాపూరు రాయల్స్ జట్టు

రాపూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పది రోజులుగా అంకయ్య మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ కొనసాగింది. ఈ టోర్నమెంట్‌లో మండలంలోని వివిధ గ్రామాల నుంచి మొత్తం 30 జట్లు పాల్గొనగా, చివరకు హోంలెవెన్స్, రాపూరు జట్లు ఫైనల్స్‌కు చేరుకున్నాయి. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో రెండు జట్లు తలపడగా, మొదటగా హోం టీం లెవెన్స్ జట్టు బ్యాటింగ్ చేసి 76 పరుగులు సాధించింది. ఇందులో నర్సింహ 25 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచారు. 77 పరుగుల లక్ష్యంతో బరిలో దిగిన రాపూరు రాయల్స్ జట్టు నిర్ణీత ఓవర్లు ఆడి 77 పరుగులు సాధించింది. ఈ జట్టులో మోగ్లీ 40 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచి మాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్నారు. విజేతగా నిలిచిన జట్టుకు కప్పుతో పాటు రూ.20వేలు నగదు, రన్నర్‌గా నిలిచిన హోం టీం జట్టుకు రూ.10 వేలతో పాటు ట్రోఫీని అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు సుధాకర్, మోషే తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఆర్ క్రికెట్ టోర్నీ విజేత కొమ్మలపూడి హెచ్‌సీసీ జట్టు



కప్ అందుకుంటున్న కొమ్మలపూడి హెచ్‌సీసీ జట్టు

మనుబోలు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఎన్ఎస్ఆర్ క్రికెట్ టోర్నీ విజేతగా కొమ్మలపూడి హెచ్‌సీసీ జట్టు నిలిచింది. ఈనెల 8 నుంచి మండలంలోని జట్లకొండూరులో జరుగుతున్న ఈ పోటీల్లో మొత్తం 18 జట్లు పాల్గొన్నాయి. ఆదివారం ఫైనల్స్ నిర్వహించారు. జట్లకొండూరు-బి జట్టు, కొమ్మలపూడి హెచ్‌సీసీ జట్టుతో తలపడింది. ముందుగా బ్యాటింగ్ ఎంచుకున్న జట్లకొండూరు-బి జట్టు నిర్ణీత పది ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 38 పరుగులు మాత్రమే చేసింది. కొమ్మలపూడి జట్టు 5 ఓవర్లలో రెండు వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించి విజేతగా నిలిచింది. ఆ జట్టుకు ఎన్ఎస్ఆర్ ట్రస్టు తరఫున అంబటి శ్రీనివాసులు రెడ్డి రూ. 10వేలు నగదు, కప్‌ను అందజేశారు. రన్నర్ జట్టుకు జట్లకొండూరు ఉపసర్పంచు ఆవుల తులసీరామ్ యాదవ్ రూ.7వేల నగదు, కప్ అందజేశారు. దాతలకు క్రీడాకారులు, నిర్వాహకులు సునీల్, రమేష్ ధన్యవాదాలు తెలిపారు.

నీలకంఠేశ్వరుడికి ఏకాంతసేవ

తోటపల్లి గూడూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకన్నపాలెంలో ఉన్న బాలా త్రిపుర సుందరీ సమేత నీలకంఠేశ్వరస్వామి ఉత్సవాలు ఆదివారం రాత్రి ఏకాంత సేవతో ముగిశాయి. ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు తంగిరాల అంకయ్య ప్రసాద్, తంగిరాల కృష్ణ పవన్, బండారం ప్రభాకర్ స్వామి శాస్త్రోక్తంగా పూజలు చేశారు. వంశపారంపర్య ధర్మకర్త మూలంరెడ్డి సుబ్బరామిరెడ్డి, కాకాణి నరహరిరెడ్డి, దువ్వూరు గంగాధర్‌రెడ్డి, రవినాయుడు, రాపూరు సుధీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చూడచక్కని రంగుల మధ్య విద్యార్థులు లేక వెలవెలబోతున్న పాఠశాల

వసతులున్నా విద్యార్థులు ఏరీ!?

● నాడు 250.. నేడు 25 మంది



పాఠశాలలో ఏర్పాటు చేసిన కొళాయిలు

అనంతసాగరంలోని హిందూ ప్రాథమిక పాఠశాలలో వైసీపీ ప్రభుత్వ హయాంలో నాడు-నేడు పథకం ద్వారా అభివృద్ధి పనులు జరిగాయి. ఆ తర్వాత విలీన ప్రక్రియ అమల్లోకి తెచ్చి ఇక్కడున్న విద్యార్థులను ఉన్నత పాఠశాలకు తరలించారు. చివరకు 250 మందికిగాను 25 మంది మాత్రమే మిగిలారు. నాడు ఈ పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు బోధన జరిగేది. ఇక్కడ అడ్మిషన్ పొందాలన్న డిమాండ్ కూడా ఉండేది. వైసీపీ తెచ్చిన విలీనం కారణంగా విద్యార్థుల సంఖ్య గణనీయంగా పడిపోయింది. ప్రస్తుతం 25 విద్యార్థులు, ఇద్దరు టీచర్లు మాత్రమే ఉన్నారు. పాఠశాలలో తాగు నీటి ప్లాంట్, కుళాయిలు, అదనపు గదులు, రేకులషెడ్లు, ఫ్యాన్లు, బెంచీలు, మురుగుదొడ్లు అందుబాటులో ఉన్నాయి. ఇన్నీ ఉన్నా అందుకు తగ్గట్టు విద్యార్థులు మాత్రం లేరు. 1, 2 తరగతులకు పరిమితం చేసి ఫౌండేషన్ పాఠశాలగా మార్చినట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

- అనంతసాగరం, (ఆంధ్రజ్యోతి)

నిర్లక్ష్యపు మొక్కలు..



ఆనకట్ట వంతెనపై ఏపుగా పెరిగిన మొక్కలు

ఉదయగిరి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఉదయ గిరి ఆనకట్టపై మొక్కలు ఏపుగా పెరగడంతో ప్రమాదం పొంచి ఉందని పలువురు పట్టణ వాసు లు వాపోతున్నారు. మొక్కల వేర్లు స్లాబులోకి చొచ్చుకొని నెర్రెలుబారి ఉన్నాయి. వాహనాల రాకపోకల సమయంలో స్లాబు దెబ్బతినే అవ కాశం ఉంది. ఇప్పటికే వాకర్స్, పట్టణ ప్రజలు వంతెనకు ఇరువైపులా వచ్చిన మొక్కలు తొలగిం చాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఉన్నారు. నిత్యం అధికారులకు వంతెనపై ఆ మొక్కలు కనిపిస్తున్నా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తు న్నారని పలువురు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మొక్కలను తొలగించి వంతెను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

నర్రవాడలో ఉత్సవ సంబరం

● ప్రారంభమైన వెంగమాంబ బ్రహ్మోత్సవాలు

● వలస వాసుల రాకతో గ్రామాల్లో సందడి



హోమంలో పాల్గొన్న ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు

దుత్తలూరు (ఉదయగిరి), జూన్ 15(ఆంధ్రజ్యోతి) : నర్రవాడలోని శ్రీవెంగమాంబ పేరంటాలమ్మ బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. వెంగమాంబ వంశస్తులైన పచ్చవ కుటుంబ సభ్యులు అమ్మవారికి పసుపు, కుంకుమ తీసుకొచ్చి ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. శ్రీ వెంగమాంబ జన్మించిన గ్రామమైన వడ్డిపాళెం పచ్చవ దేవర ఇంట్లో పసుపు దంచే కార్యక్రమం కనులపండువగా జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొంటే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల విశ్వాసం. సంతానం లేని మహిళలు కూడా పసుపు దంచేందుకు పోటీ పడ్డారు. పచ్చవ దేవర ఆలయాన్ని, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు, ఆలయ అధికారులు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులుతీరారు. మొక్కుబడి ఉన్న భక్తులు కుటుంబ సమేతంగా అమ్మవారి సన్నిధిలో తలనీలాలు సమర్పించుకొన్నారు.

● గ్రామాల్లో సందడి

బ్రహ్మోత్సవాలకు వలస వాసులు గ్రామాలకు చేరుకొంటుండటంతో సందడి నెలకొంది. ఎన్ని పనులన్నా ఈ ఉత్సవాల్లో వలస వాసులు కుటుంబ సమేతంగా పాల్గొంటారు. స్థానిక వలస వాసులేగాక గుంటూరు, విజయవాడ, ఒంగోలు, చెన్నై, బెంగళూరు, హైదరాబాదు, విశాఖ తదితర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు ఈ ఉత్సవాలకు తరలివస్తున్నారు.

● ఉత్సవాల్లో నేడు

వెంగమాంబ ఉత్సవాల్లో రెండో రోజు సోమవారం వెంగమాంబ పేరంటాలమ్మ దంపతులకు గ్రామోత్సవం జరగనుంది. ఈ ఉ త్సవంతో పాటు బాణసంచా కాల్చడం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.



ఆకట్టుకున్న బాలికల నృత్య ప్రదర్శన

దుర్గంపై అటవీ అధికారుల తనిఖీ



పెద్దమసీదు ప్రాంతంలో తనిఖీ నిర్వహిస్తున్న అటవీ సిబ్బంది

ఉదయగిరి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ఉదయగిరి దుర్గం కొండపై ఆదివారం అటవీశాఖ అధికారులు, సిబ్బంది తనిఖీ నిర్వహించారు. శనివారం రాత్రి దుర్గంపై ఉన్న పెద్ద మసీదు వద్ద దీపాలు వెలుగుతుండడంతో గుప్తనిధుల తవ్వకాల ముఠా సంచరిస్తుందనే అనుమానంతో స్థానికులు అటవీశాఖ ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. దాంతో ఎఫ్ఎస్ఓ చినవెంకటయ్య, ఎఫ్‌బీఓలు చిన్నపురెడ్డి, లక్ష్మీప్రసన్న, వెంకటేశ్వర్లు బేస్ట్‌క్యాంపు, స్ట్రైకింగ్‌ఫోర్స్‌తో దుర్గంపైకి వెళ్లారు. వారు చిన్న, పెద్ద మసీదులు, గుర్రశాలలు, మెట్ల మార్గం, టప్పా తొట్టి తదితర ప్రాంతాల్లో గుప్తనిధుల తవ్వకాలు ఏమైనా జరిగాయా అని పరిశీలించారు. దుర్గంపై ఎలాంటి గుప్తనిధుల తవ్వకాలు లేకపోవడంతో వెనుతిరిగారు.

డేంజర్ స్పాట్ .. !!

● రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు



కారు ఢీకొనడంతో రోడ్డుపై పడిపోయిన క్షతగాత్రులు



నుజ్జునుజ్జయిన కారు

ఆత్మకూరు, జూన్ 15 (ఆంధ్ర జ్యోతి) : పట్టణ సమీపంలోని నెల్లూరు - ముంబాయి జాతీయ రహదారి సమీపంలో ఏఎస్‌పేట క్రాస్‌రోడ్డు వద్ద ఇటీవల ఆటోను కారు ఢీకొనడంతో ముగ్గురు మృతి చెందిన విషయం తెలిసిందే. అదే స్థలంలో ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల మేరకు ఏఎస్‌పేట క్రాస్ రోడ్డు వద్ద ఇండియన్ పెట్రోల్ బంక్ సమీపంలో నెల్లూరు వైపు నుంచి వస్తున్న కారు, నెల్లూరు పాళెం నుంచి వెంకట్రావుపల్లికి వెళ్తున్న టీవీఎస్ ఎక్స్‌ఎల్ బైకును ఢీకొంది. దాంతో బైకుపై ప్రయాణిస్తున్న మల్లిక పెంచలయ్య, యాకసిరి శ్రీనివాసులు రోడ్డుపై పడడంతో ఇద్దరికీ తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే 108 వాహన సిబ్బంది ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. యాకసిరి శ్రీనివాసులు పరిస్థితి విషమంగా ఉంది.

టాక్స్ ప్రాక్టీషనర్లు న్యాయ సంబంధ విషయాలు తెలుసుకోవాలి

● ఏఐఎఫ్‌టీపీ సమావేశంలో జస్టిస్ జయసూర్య



జ్ఞాపిక అందచేస్తున్న జస్టిస్ జయసూర్య, జీఎస్టీ అధికారులు, చిత్రంలో టాక్స్‌ప్రాక్టీషనర్లు

నెల్లూరు(హరనాథపురం), జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : టాక్స్ ప్రాక్టీషన ర్లందరూ న్యాయ సంబంధ విషయాలను తెలుసుకొని డీలర్లకు ఉత్తమ సేవలు అందించాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్ జయసూర్య సూచించారు. నెల్లూరులోని ఓ హోటల్ సమావేశ మందిరంలో ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ టాక్స్ ప్రాక్టీషనర్స్(సౌత్‌జోన్) సమావేశం ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన జస్టిస్ జయసూర్య మాట్లాడుతూ జీఎస్టీ, ఇన్‌కంటాక్సుకు సంబంధించి టాక్స్ ప్రాక్టీషనర్ల పాత్ర ముఖ్యమైందన్నారు. వారు నిబద్ధత, నిజాయితీ, అంకిత భావంతో పని చేస్తూ వృత్తికి వన్నెతేవాలన్నారు. ఏ సమయంలోనైనా టాక్స్ ప్రాక్టీషనర్లకు న్యాయ సంబంధ విషయాలను తెలియచేయడానికి తాను సిద్ధంగా ఉంటానని చెప్పారు. అనంతరం పలువురు టాక్స్ ప్రాక్టీషనర్లు అడిగిన ప్రశ్నలకు జీఎస్టీ కమిషనర్ రవిశంకర్ సమాధానం చెప్పారు. జీఎస్టీ రాబట్టడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో జీఎస్టీ అదనపు కమిషనర్ జేవీఎం శర్మ, ఏఐఎఫ్‌టీపీ జాతీయ అధ్యక్షుడు సమీర్‌జానీ, జాతీయ ఉపాధ్యక్షుడు ఎస్ వెంకట రమణి, సెక్రటరీ జనరల్ గుప్తా, ప్రముఖ ఆడిటర్లు ఏవీఎస్ కృష్ణమోహన్, కోట సునీల్‌కుమార్, ఎస్వీఎస్ రాఘవేంద్రరావు, చిన్ని నారాయణరావు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకంగా ముద్రించిన సావనీర్‌ను ఆవిష్కరించారు. ఉత్తమ ఆడిటర్లకు జ్ఞాపికలు అందచేశారు.





మాట్లాడుతున్న డాక్టర్ విరించి, మాజీ ఎమ్మెల్సీ శర్మ

వైద్య విద్య ప్రైవేటీకరణ సరికాదు

● ప్రాథమిక ఆరోగ్యాన్ని పట్టించుకోని ప్రభుత్వం

● ప్రజారోగ్య నిపుణుడు డాక్టర్ విరించి

నెల్లూరు (వైద్యం), జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : వైద్య రంగంలో అసమానతలు తీవ్రంగా ఉన్న స్థితిలో ప్రభుత్వం తమ బాధ్యతల నుంచి తప్పించుకునేందుకు వైద్య విద్యను ప్రైవేట్‌పరం చేయాలని చెప్పటం దారుణమని హైదరాబాద్‌కు చెందిన ప్రజారోగ్య నిపుణుడు డాక్టర్ విరించి అన్నారు. ఆదివారం నెల్లూరులోని డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో డాక్టర్ జెట్టి శేషారెడ్డి 17వ స్మారక సదస్సు జరిగింది. మెడికల్ కళాశాల ప్రైవేటీకరణ - పర్యవసానాలు అనే అంశంపై విరించి ప్రసంగించారు. ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేయాల్సిన అంశాన్ని పక్కన పెడుతూ రాష్ట్రంలో అందుబాటులోకి తెస్తున్న 12 వైద్య కళాశాలలను పీపీపీ పద్ధతిలో ప్రైవేట్ వారికి అప్పగిస్తామని ప్రభుత్వం ప్రకటించటం సరికాదన్నారు. ఇది అమల్లోకి వస్తే సామాన్యులకు వైద్య విద్య దూరమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. భారత రాజ్యాంగం - పూర్వాపరాలు, సవాళ్లు అన్న అంశంపై మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ ఉపన్యసించారు. భారత రాజ్యాంగానికి మూలస్తంభాలైన ప్రజాస్వామ్యం, లౌకికతత్వం, ఫెడరలిజం, సామాజిక న్యాయం, స్వావలంబన అనే ఐదింటిపై తీవ్రమైన దాడులు జరుగుతున్నాయని చెప్పారు. ఎన్నికల సంఘం, ఈడీ, ఆదాయ పన్ను శాఖలను కేంద్ర ప్రభుత్వం ఎలా వాడుకుంటుందో అందరికీ తెలిసిందే నన్నారు. కాగా, ఈ కార్యక్రమాన్ని జనవిజ్ఞాన వేదిక, ప్రజారోగ్య వేదిక, మెడికల్ రిప్రజెంటేటివ్స్ యూనియన్, ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్, డాక్టర్ రామచంద్రారెడ్డి ప్రజావైద్యశాల, యునైటెడ్ మెడికల్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు నిర్వహించారు.

సమాచారం లేకుండా సరుకులు

● తూకంపై డీలర్ల ఆందోళన



సరుకుల కోసం క్యూలో నిలబడ్డ కార్డుదారులు

నెల్లూరు(హరనాథపురం), జూన్ 15(ఆంధ్రజ్యోతి) : ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి ముందస్తు సమాచారం ఇవ్వకుండానే సరుకులు రేషన్ డీలర్లకు పంపుతున్నారు. దీంతో డీలర్లు తమకు కచ్చితమైన తూకంతో రావాల్సిన సరుకులు అందవని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతీ నెలా కార్డుదారులకు అందచేయడానికి రేషన్‌షాపులకు సరుకులను పంపిణీ చేస్తుంటారు. జిల్లాలో 1513 చౌకదుకాణాలు ఉన్నాయి. వీటన్నింటికీ ముందస్తు సమాచారం ఇచ్చి, డీలర్‌ను ఎంఎల్ఎస్ పాయింట్‌కు పిలిపిం చుకుని వేలిముద్ర వేయించుకున్న తరువాత సరుకులు తోలాల్సి ఉంటుంది. కానీ అలా జరగడం లేదనే ఆరోపణలున్నాయి. దీనికితోడు కేటాయించిన విధంగా ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి మొత్తం సరుకులు రేషన్ షాపులకు సకాలంలో రావటం లేదనేది సమాచారం. కొన్ని చౌక దుకాణాల్లో స్టాక్ వివరాలు ప్రదర్శిం చడం లేదని తెలిసింది. కొందరు డీలర్లు షాపుల లైసెన్సులు రెన్యువల్ చేసుకోనట్లు సమా చారం. నూతనంగా రేషన్ షాపుల ద్వారా సరుకుల వివరాలకు సంబంధించి ప్రత్యేక యాప్‌లు కూడా ఉన్నాయి. వాటిని అధికారులు పరిశీలించాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

సరుకులు తీసుకోవద్దు



జిల్లాలోని రేషన్ డీలర్లందరూ వారి పరిధిలోని ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి అధికారులు ఇచ్చే ముందస్తు సమాచారంతో వేలిముద్ర వేసి సరుకులు తెచ్చుకోవాలి. సమాచారం లేకుండా రేషన్ షాపులకు సరుకులను పంపితే వెనక్కు పంపుతాం. డీలర్లందరూ ఈనెల 30లోగా తప్పని సరిగా రేషన్ షాపుల లైసెన్సులను రెన్యువల్ చేయించుకోవాలి. ఇది డీలర్ల బాధ్యత. అలాగే స్టాక్ బోర్డులో వివరాలను సరిగా ప్రదర్శించాలి. ఈకేవైసీ చేయించుకోని వినియోగదారులకు ఈకేవైసీ చేయించాలి. రేషన్ షాపులకు ఉండే అలాట్‌మెంటు తగ్గకుండా చూచుకోవాలి.

- జీవీ కృష్ణారెడ్డి, నెల్లూరు జిల్లా రేషన్ డీలర్ల సంఘం ప్రధాన కార్యదర్శి

మోటారు సైకిల్ దగ్ధం



మంటలు అంటుకోవడంతో కాలిపోయిన మోటారు సైకిల్

కలువాయి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక బస్టాండు సెంట ర్‌లోని ఓ దుకాణం ముందు నిలిపి ఉన్న మోటారు సైకిల్‌కు మంటలు అంటుకుని కాలిపోయిన సంఘటన ఆదివారం ఉదయం జరిగింది. సమీపంలో చెత్త తగలబెట్టడంతో వచ్చిన మంటలు దగ్గరలోని మోటారు సైకిల్‌కు వ్యాపించాయి. వెంటనే అక్కడ ఉన్న వారు ఇసుక, మట్టి వేసి మంటలను ఆర్పివేశారు. అప్పటికే కోటూరుపల్లికి చెందిన షేక్ ఫైమా మోటారు సైకిల్ చాలా వరకు దెబ్బతింది.

కసుమూరు దర్గాలో సినీ నటుడు అలీ



అలీ దంపతులను సన్మానిస్తున్న దర్గా అధికారి షరీఫ్, ముజావర్లు

వెంకటాచలం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధి పుణ్యక్షేత్రం కసుమూరు మస్తాన్ వలీ దర్గాను ఆదివారం ప్రముఖ సినీ నటుడు అలీ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారికి దర్గా ముజావర్లు ఘన స్వాగతం పలికారు. అనంతరం దర్గాలో అలీ కుటుంబం పేరిట ప్రత్యేక పూజలు చేసి ప్రసాదం అందజేశారు. దర్గా కార్యాలయంలో అలీ దంపతుల ను సత్కరించి దర్గా ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో దర్గా ఈవో షరీఫ్, ముజావర్లు ఎంఎస్ దస్తగిరి, మొహమ్మద్, ఇస్మాయిల్, కాలేషా, మున్నా, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

కోడిపందేల స్థావరంపై పోలీసుల దాడి

● 12 మంది అరెస్ట్ ● రూ.12,090 నగదు, 9 కోళ్లు స్వాధీనం



పోలీసుల అదుపులో కోడిపందేల నిర్వాహకులు

కావలి రూరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కోడిపందేల స్థావరంపై పోలీసులు దాడులు చేసి 12 మందిని అరెస్ట్ చేసిన సంఘటన ఆదివారం కావలి మండలం చలంచర్లలో జరిగింది. రూరల్ పోలీసుల వివరాల మేరకు.. చలంచర్ల అటవీప్రాంతంలో కోడిపందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో సిఐ జి రాజేశ్వరరావు సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో కోడిపందేలు నిర్వహిస్తున్న 12 మందిని అరెస్ట్‌చేసి వారి వద్ద నుంచి 9 కోళ్లు, రూ. 12090 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐలు బాజీబాబు, తిరుమల రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు : సిఐ

మండలంలో కోడిపందేలు, జూదాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సిఐ రాజేశ్వరరావు పేర్కొన్నారు. అలాగే ఆన్‌లైన్ బెట్టింగ్‌లు గంజాయి, డ్రగ్స్ అమ్మకాలు చేపడుతుంటే సత్వర సమాచారం అందించాలని, వివరాలు గోప్యంగా ఉంచటం జరుగుతుందన్నారు.

రోడ్డుప్రమాదంలో ఒకరికి గాయాలు

కలిగిరి జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కలిగిరి - కొండాపురం రహదారిలోని ఐవోసి పెట్రోల్ బంక్ వద్ద ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. ప్రమాదంలో గాయపడిన వ్యక్తి కొండాపురం మండలం ఇస్కుదామెర్లకు చెందిన ఇరగల ఇంద్రసేనారెడ్డిగా గుర్తించారు. అపస్మారక స్థితిలో ఉన్న అతడిని 108 వాహనంలో వింజమూరు ప్రభుత్వ వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు.

రెండు లారీల ఢీ : డ్రైవర్‌కు స్వల్పగాయాలు

మనుబోలు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మనుబోలు మండలం కృష్ణపట్నం పోర్టు క్రాస్ రోడ్డు వద్ద జాతీయ రహదారిపై ఆదివారం రెండు లారీలు ఢీకొన్నాయి. ఓ వాహనం డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఖాళీగా ఉన్న గ్యాస్ ట్యాంకర్ పోర్టుకు వెళ్లేందుకు మలుపు తిప్పుతుండగా, చెన్నై వెళుతున్న లారీ ఢీకొంది. దీంతో లారీ ముందుభాగం నుజ్జునుజ్జుకాగా, డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో నెల్లూరుకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



ప్రమాదంలో గాయపడి 108 వాహనంలో ఉన్న లారీడ్రైవర్

చికిత్స పొందుతూ తల్లి మృతి

● కొడుకు పరిస్థితి విషమం

వెంకటాచలం, (ఆంధ్రజ్యోతి) : పురుగు మందు తాగి ఆసుపత్రి పాలైన తల్లీకొడుకుల్లో తల్లి మృతి చెందగా కుమారుడి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసుల కథనం మేరకు... వెంకటాచలం మండలం ఈదగాలి గ్రామానికి చెందిన పర్వతాల మహాలక్ష్మి(80), సుబ్రహ్మణ్యం తల్లీకొడుకులు. మద్యానికి బానిసైన సుబ్రహ్మణ్యం ఈ నెల 6వ తేదీ మద్యం మత్తులో పురుగుల మందు గ్లాసులో పోసుకుని తాగాడు. గ్లాసులో కొంత పురుగుల మందు మిగిలి ఉండగా దానిని పొరపాటున తల్లికి ఇచ్చాడు. ఆమె మంచినీళ్లు అనుకుని తాగేసింది. ఈ విషయాన్ని గుర్తించిన కుటుంబ సభ్యులు వారిద్దరినీ నెల్లూ రులోని ఓ ప్రైవేటు అసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొం దుతూ మహాలక్ష్మి శనివారం రాత్రి మృతి చెందగా, సుబ్రహ్మణ్యం పరి స్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ఆయనను మెరుగైన వైద్యం కోసం నెల్లూరులోని కార్పొరేట్ అసుపత్రికి తరలించారు. మహాలక్ష్మి కుమార్తె శ్యామల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చిలకలమర్రిలో పూరిల్లు దగ్ధం



అనంతసాగరం జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిలకలమర్రిలో శనివారం రాత్రి జీ పెంచలయ్యకు చెందిన పూరిల్లు దగ్ధమైంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంలో రూ. లక్ష ఆస్తినష్టం జరిగినట్లు బాధితుడు తెలిపాడు. బాధిత కుటుంబానికి జనసేనపార్టీ నేతలు పరామర్శించారు. మంగళవారం వారికి సాయం అందిస్తామని ప్రకటించారు.

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	119
స్కిన్ చికెన్	214
స్కిన్‌లెస్	238

కోడిగుడ్ల ధర (100): 515

బంగారం, వెండి ధరలు
బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.9600
వెండి కిలో ధర	రూ. 109,300
వెండి ఒక గ్రాము	రూ.112.30

యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

కలువాయి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పెంచలకోనలో సోమవారం జరిగే యోగాంధ్ర కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని టీడీపీ మండల కన్వీనర్ జీ.వెంకటేశ్వర్లు నాయుడు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ హాజరవుతారని తెలిపారు. జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు కూడా పాల్గొనాలని ఆయన కోరారు.

న్యూస్ బాక్స్

వృద్ధులు, తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయొద్దు

అల్లూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): వృద్ధులు, తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయడం సామాజిక నేరమని లోక్ అదాలత్ సభ్యుడు ఎం మాలకొండారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రపంచ వృద్ధులపై వేధింపుల అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయన పలు విషయాలను పేర్కొన్నారు. నేటి సమాజంలో పలువురు తమ తల్లిదండ్రులను, వయోవృద్ధులను చిన్నచూపు చూస్తున్నారని, వారిని గౌరవించాల్సి ఉందని పేర్కొన్నారు. 2007లో కేంద్ర ప్రభుత్వం వయోవృద్ధుల సంరక్షణ చట్టాన్ని తీసుకొచ్చిందని, దీని ద్వారా వేధింపులకు గురైన వయోవృద్ధులు న్యాయాన్ని పొందే అవకాశం ఉందన్నారు. అదేవిధంగా కష్టపడి చదివించిన తల్లిదండ్రుల పోషణా బాధ్యతలను విస్మరిస్తే చట్టపరంగా పోషణ నిర్వహణ ప్రతిఫలాన్ని పొందే అవకాశం ఉందన్నారు. తల్లిదండ్రులు భారమనుకొని వృద్ధాశ్రమాలకు తరలించకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన సూచించారు.

ముగిసిన సీతారాముల ఉత్సవాలు

ఉదయగిరి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాయపాళెం పంచాయతీ గంగిరెడ్డిపల్లి గ్రామంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న శ్రీకోదండరామస్వామి ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా చివరిరోజు స్వామివారిని ప్రత్యేక వాహనంలో ప్రతిష్ఠించి గ్రామ పురవీదుల్లో గ్రామోత్సవం చేశారు. అనంతరం పారువేట, వసంతోత్సవ కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

గంగాభవాని ఉత్సవాలు ప్రారంభం: గంగిరెడ్డిపల్లి గ్రామంలో వెలసిన శ్రీఅనంతపూరిగంగాభవాని అమ్మవారి ఉత్సవాలు ఆదివారం నిలుపు కార్యక్రమంతో వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి చరిత్రను వివరించారు. అనంతరం ప్రత్యేక వాహనంలో అమ్మవారిని ప్రతిష్ఠించి గ్రామోత్సవం నిర్వహించారు.

ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశాలు అమలు చేయాలి

కందుకూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): గుడ్లూరు మండలం చేవూరు వద్ద జాతీయ రహదారి పక్కనే రామదూత ఆశ్రమం పేరుతో దొంగస్వామి ఆక్రమించిన చెరువు పోరంబోకు భూమిని, అటవీభూమిని తక్షణం స్వాధీనం చేసుకుని అక్రమ నిర్మాణాలు కూల్చివేయాలని ప్రిన్సిపల్ సెక్రటరీ జారీచేసిన ఆదేశాలను అమలుచేయాలని హేతువాద సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నార్నె వెంకటసుబ్బయ్య ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తక్షణం ఆ భూములను స్వాధీనం చేసుకోకుంటే స్థానిక అధికారులు హైకోర్టు మెట్లు ఎక్కేందుకు సిద్ధంగా ఉండాలని ఆయన పేర్కొన్నారు.

శేషసాయి మందిరంలో..

బిట్రగుంట, (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం బిట్రగుంట ద్వారకా నగరులోని షిరిడీ శేషసాయి మందిరంలో ఆదివారం బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మందిర ఆవరణలో పేదలు, వృద్ధులు, దివ్యాంగులకు మందిర వ్యవస్థాపకులు కుట్టుబోయిన బ్రహ్మానందం, వసుంధర దంపతులు అన్నసంతర్పణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శేషసాయినాథుని విగ్రహ ప్రతిష్ఠ చేసి 25 సంవత్సరాలు పూర్తికావస్తున్న సందర్భంగా జూలై 10న ప్రత్యేక పూజా కార్యక్రమాలు, రాష్ట్రస్థాయిలో ఎద్దుల బండ లాగుడు ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

వింజమూరు, (ఆంధ్రజ్యోతి) : గ్రామంలోని వైఆర్ జూనియర్ కళాశాలలో శేగు సుబ్బారావు, నిర్మలాదేవి, ఎన్‌ఆర్‌ఐ శేగు సతీష్ దాతృత్వంతో జూన్ 6 నుంచి నిర్వహిస్తున్న శంకర నేత్రాలయం చెన్నై వారి ఉచిత కంటి వైద్య శిబిరం 9వ రోజు ముగింపుకు చేరింది. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశంలో చెన్నై నుంచి వచ్చిన ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ గజేంద్రకుమార్ వర్మ మాట్లాడుతూ మొత్తం 883 మందికి పరీక్షలు నిర్వహించగా 170 మందికి కంటి శస్త్రచికిత్సలు నిర్వహించినట్లు తెలిపారు. శంకర నేత్రాలయం ప్రజా సంబంధాల అధికారి రంజిత్‌కుమార్ మాట్లాడుతూ ఎన్‌ఆర్‌ఐ అయిన శేగు సతీష్, అతని కుటుంబం ఆర్థిక సాయంతో పాటు, సేవా కార్యక్రమాలు చేయడం ఎంతో అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వనిపెంట హైమావతి, వనిపెంట సుబ్బారెడ్డి, నిర్వాహకులు యల్లాల రఘురామిరెడ్డి, పలుకూరు వెంగయ్య, మందాడి శ్రీనివాసరెడ్డి, తిరుపాలు, చలమయ్య, కందల మధు, కొండారెడ్డి, తిప్పిరెడ్డి కృష్ణారెడ్డి, డాక్టర్ యల్లాల అనీల్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ యల్లాల శ్రీనిధి పాల్గొన్నారు.

ఉచిత టైలరింగ్ శిక్షణలో
వసతులేవి?..

- పని చేయని ఫ్యాన్లు, ఉక్కపోతతో అవస్థలు
- తాగునీరు, బాత్‌రూమ్‌ల కరువు
- చాలావరకు మరమ్మతులకు గురైన మిషన్లు
- పట్టించుకోని అధికారులు

సంగం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఉచిత టైలరింగ్ శిక్షణ కేంద్రంలో కనీస మౌలిక వసతులు కూడా లేక మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎండాకాలంలో అయితే మహిళలు తాగునీటికి కూడా అల్లాడాల్సిన పరిస్థితి. అంతేకాకుండా చాలావరకు కుట్టు మిషన్లు మరమ్మతులకు గురవడంతో పట్టించుకునే నాథులే లేరు. దీంతో టైలరింగ్‌కు వచ్చే మహిళలు అసౌకర్యాల నడుమ శిక్షణ పొందాల్సిన పరిస్థితి ఏర్పడింది.

మండల కేంద్రమైన సంగంలో బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో స్థానిక వెలుగు కార్యాలయంలో మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ఏర్పాటు చేశారు. సుమారు 120 మందికి పైగా దరఖాస్తు చేసుకోవడంతో రెండు బ్యాచ్‌లుగా ఏర్పాటు చేసి శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ ఇచ్చేందుకు ఒక మాస్టర్ టైలర్‌ను కూడా ఏర్పాటు చేశారు. ఆమె ఆధ్వర్యంలో రెండు నెలలుగా శిక్షణ జరుగుతోంది. ఉదయం 10గంటల నుంచి ఒంటి గంట వరకు ఒక బ్యాచ్, మధ్యాహ్నం 2 గంటల నుంచి 5గంటల వరకు మరో బ్యాచ్‌కు శిక్షణ ఇస్తున్నారు.

ఉచిత టైలరింగ్ శిక్షణ కోసం ప్రభుత్వం 25 కుట్టు మిషన్లను సరఫరా చేసింది. అయితే శిక్షణ ప్రారంభమైన కొద్ది రోజులకే 10 మిషన్లు మరమ్మతులకు గురయ్యాయి. ఈ విషయంపై అధికారులకు తెలిపినా వారు పట్టించుకోకపోవడమే కాకుండా శిక్షకులే రిపేర్ చేయించుకోవాలని సమాధానం ఇస్తున్నారు. దీంతో ఒక్కొక్క మిషన్ మీద ముగ్గురు లేక నలుగురు టైలరింగ్ నేర్చుకోవాల్సివస్తోంది. ఒకరు మిషన్ వద్ద కూర్చుంటే మిగతా వారు ఖాళీగా ఉండాల్సిన పరిస్థితి. దీంతో సమయం వృథా అవుతుందని మహిళలు వాపోతున్నారు.


టైలరింగ్‌లో శిక్షణ పొందుతున్న మహిళలు

కనీస వసతులూ కరువే..


కుట్టు శిక్షణకు వచ్చిన మహిళలకు శిక్షణ కేంద్రంలో కనీసం మరుగుదొడ్డి వసతి కూడా లేదు. ఫ్యాన్లు పనిచేయడం లేదు, అలాగే తాగేందుకు మంచినీరు ఏర్పాటు చేయకపోవడంతో ఇంటి వద్ద నుంచే వాటర్ బాటిల్ తీసుకుని రావలసి వస్తుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా ప్రతి మహిళ తన సొంత ఖర్చులతో (వస్త్రం తెచ్చుకుని) మూడు డ్రస్సులు కుట్టి చూపించాలని నిబంధన ఉంది. దీంతో ప్రతినిత్యం రాకపోకల చార్జీల ఖర్చులే నెలకు రూ. 1000లు అవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరు అమలు

కుట్టు శిక్షణకు వచ్చే మహిళలకు ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరు అమలు చేస్తున్నారు. దీంతో ఉదయం 10 గంటలకు వస్తేనే హాజరు లేకపోతే యాప్ క్లోజ్ అవుతుంది. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే మహిళలకు ఇది ఎంతో ఇబ్బందికరంగా ఉంది. శిక్షణకు వచ్చే మహిళలకు రానుపోను స్టయిఫండ్‌తో పాటు మ్యానువల్ హాజరు అమలు చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. అలాగే శిక్షణ కేంద్రంలో తాగునీరు, ఫ్యాన్లు, కుట్టు మిషన్లను మరమ్మతులు చేయించడం వంటి కనీస వసతులు ఏర్పాటు చేయాలని మహిళలు కోరుతున్నారు.

10 అడుగులకు తగ్గిన
రాళ్లపాడు నీటిమట్టం

- ఉత్తర కాలువ వెడల్పు పనులతో నిలిచిన నీటి సరఫరా


రాళ్లపాడు ప్రాజెక్టులో 10 అడుగులకు తగ్గిన నీటిమట్టం

లింగసముద్రం, జూన్ 15 (ఆంధ్ర జ్యోతి): రాళ్లపాడు ప్రాజెక్టులో నీటిమట్టం 10 అడుగులకు పడిపోయింది. ప్రస్తుతం ప్రాజెక్టులోకి ఎలాంటి నీటి ప్రవాహం రావడం లేదని ప్రాజెక్టు డీఈఈ ఎం వెంకటేశ్వర్లు ఆదివారం తెలిపారు. అలాగే ప్రాజెక్టు నుంచి ఎలాంటి అవుట్‌ఫ్లో కూడా వెళ్లడం లేదని, ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువలకు కూడా నీటి సరఫరా నిలిపి వేసినట్టు తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టులో ఉన్న 10 అడుగుల నీరు తాగునీటి పథకాలకు సరఫరా చేసేందుకు ఎలాంటి ఇబ్బంది లేదని, ఈనీరు మరో ఆరేడు నెలల పాటు వస్తుందని ఆయన తెలిపారు. ప్రాజెక్టులోని నీరు తాగునీటి పథకాలకు రోజుకు 7 క్యూసెక్కులు, నీరు ఆవిరి రూపంలో, గేట్ల నుండి లీకేజీ రూపంలో 10 క్యూసెక్కుల నీరు పోతుందన్నారు. అలాగే సోమశిల జలాశయం నుంచి కూడా ఉత్తర కాలువ ద్వారా నీరు రావడం లేదని, 80 కి.మీ దగ్గర నుంచి మర్రిగుంట చెరువు వైపు కాలువ వెడల్పు పనులు జరుగుతున్నాయని, అందువలన నీరు ఉత్తర కాలువ ద్వారా రావడం లేదని, పనులు పూర్తయితే రాళ్లపాడు ప్రాజెక్టులోకి నీరు సమృద్ధిగా వచ్చే అవకాశం ఉందన్నారు.

వృద్ధులకు నిత్యావసరాలు, నగదు పంపిణీ


వృద్ధురాలికి నగదు అందచేస్తున్న కావలి ఆర్డీవో సన్నీ వంశీకృష్ణ

కావలి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): డీఆర్ విశ్వోదయ సేవాసమితి ఆధ్వర్యంలో వెంగ శరావునగర్‌లోని ఆ సమితి కార్యాలయం లో ఆదివారం వృద్ధులకు నిత్యావసరాలు, నగదు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కావలి ఆర్డీవో ఎం సన్నీ వంశీకృష్ణ పాల్గొని మాట్లాడుతూ విశ్వో దయ విద్యాసంస్థల నిర్వాహకులు విద్యా ర్థులకు మంచి విద్యను అందించడమే కాక సమాజానికి సేవ చేయడం అభినంద నీయమన్నారు. ఈకార్యక్రమంలో రెక్టార్ వినయ్‌కుమార్‌రెడ్డి, సేవాసమితి డైరెక్టర్ కూనం తాతిరెడ్డి, సభ్యులు నల్లూరు రామ క్రిష్ణ, సతీష్‌సింగ్, నర్సింగ్ కాలేజి అధ్యా పకురాలు దివ్య పాల్గొన్నారు.

మన చక్రాలను శుద్ధి చేసే దివ్య ఔషధమే ధ్యానం

- ఒంగోలు మాస్టర్ దులేఖాబీ


దులేఖాబీని సత్కరిస్తున్న ధ్యానులు

వింజమూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : మానవ శరీరంలోని ఏడు చక్రాలను శుద్ధి చేసి పరిపూర్ణమైన మానవుడిగా తయారయ్యేందుకు ధ్యానం చక్కగా ఉపయోగపడుతుందని ఒంగోలు సీనియర్ పిరమిడ్ మాస్టర్ దులేఖాబీ అన్నారు. వింజమూరులోని శ్రీవేదవ్యాస వశిష్ఠ పిరమిడ్ ధ్యాన మహాశక్తి క్షేత్రంలో ఆదివారం ఆత్మజ్ఞానం కార్యక్రమంలో భాగంగా ఆమె పాల్గొని మాట్లాడారు. మన శరీరంలోని ఏడు చక్రాల గురించి ఆమె వివరణాత్మకంగా అవగాహన కల్పించారు. ఆత్మజ్ఞానాన్ని అందించిన దులేఖాబీని ధ్యానులందరూ శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో హేమలత, సుబ్బలక్ష్మీ, రాజేశ్వరి, జయప్రదలతో పాటు 40 మంది ధ్యానులు పాల్గొన్నారు.

కోటేశ్వరస్వామికి శేషవాహన సేవ

సంగం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దువ్వూరులో వెలసి ఉన్న కోటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం అర్ధరాత్రి కోటేశ్వరస్వామి శేషవాహనసేవ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా గంగా పార్వతీ సమేత కోటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను శేషవాహనంపై ఉంచి గజపూలమాలలతో అలంకరించారు. అనంతరం విద్యుత్ దీపాల నడుమ మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు.


శేషవాహనంపై దర్శనమిస్తున్న కోటేశ్వరస్వామి


నాగారపమ్మదేవికి హారతులిస్తున్న అర్చకుడు

నాగారపమ్మదేవికి
ప్రత్యేక పూజలు

సంగం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలగట్లలో వెలసి ఉన్న పురాతన నాగారపమ్మదేవి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మూలవిరాట్‌కు అభిషేకాలు నిర్వహించి అనంతరం పూలంగిసేవ ఏర్పాటు చేశారు. మహిళలు పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.


గోడపత్రికను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

గురుపూర్ణిమను విజయవంతం చేయండి

అల్లూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): గురుపూర్ణిమ వేడుకలను విజయవంతం చేయాలని స్థానిక పేటలోని షిరిడీ సాయిబాబా మందిర కమిటీ సభ్యులు కోరారు. ఆదివారం ఆలయంలో కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూలై 10వ తేదీన నిర్వహించే గురుపూర్ణిమను పురస్కరించుకొని చేపట్టే సామూహిక లక్ష మల్లెల పూజలో పాల్గొనే భక్తులు వారి గోత్ర నామాలను అర్చకులకు, కమిటీ సభ్యులకు అందజేయాలన్నారు. ఉదయం 9గంటలకు ఆలయానికి చేరుకొని పూజలో పాలొనాలని కోరారు. ఈసందర్భంగా గోడపత్రికను ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో యరమాక వెంకటశేషారెడ్డి, మేడా రమణారెడ్డి, కుండా వెంకట కృష్ణారెడ్డి, పూండ్ల మధుసూదన్‌రెడ్డి, కామకొలను వెంకట రాధాకృష్ణారావు, శివకల్యాణ్‌రెడ్డి, చంద్రమోహన్‌రాజు, మస్తానయ్య, మధు, అర్చకులు కార్తీక్ శర్మ, సుబ్బారావు శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరిలో వర్షం

ఉదయగిరి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ఉదయగిరి ప్రాంతంలో ఆదివారం సాయంత్రం ఓ మోస్తారు వర్షం కురిసింది. వర్షంతో మురుగు కాలువలు పొంగిపొర్లాయి. చెత్తాచెదారం రోడ్డుపై చేరడంతో వాహనదారులు, పాదాచారులు అవస్థలు ఎదుర్కొన్నారు. కొన్నిరోజులుగా ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వర్షం కురవడంతో వాతావరణం చల్లబడి ప్రజలు ఉపశమనం పొందారు. ఇప్పటికే రైతులు ఖరీఫ్ సీజన్ పంటల సాగుకు భూములు దుక్కులు దున్ని సిద్ధంగా ఉన్నారు. ఈ వర్షంతో మరింత అనుకూలంగా ఉంటుందని రైతులు తెలిపారు.


ఉదయగిరిలో కురుస్తున్న వర్షం

టీఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో ఉత్తమ ఫలితాలు

కందుకూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయంప్రతిపత్తి) విద్యార్థులు సెకండ్ సెమిస్టర్‌లో అత్యుత్తమ పలితాలు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు ఎం రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామ్స్ కె శ్రీనివాసులుతో కలిసి ఫలితాలను విడుదల చేసిన రవికుమార్ మాట్లాడుతూ బీఏలో 85 శాతం, బీఎస్సీలో 84శాతం, బీకాంలో 72శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. కళాశాలలో అత్యాధునిక కంప్యూటర్ ల్యాబ్, ఇతర సైన్స్ ల్యాబ్‌లతో పాటు విద్యార్థినులకు క్యాంపస్‌లోనే వసతిగృహం సదుపాయాలు ఉన్నాయని, ప్రత్యేకంగా ఉపాధి నైపుణ్య శిక్షణ, కెరీర్ గైడెన్స్ కార్యక్రమాలతో క్యాంపస్‌లోనే ఉద్యోగాలు పొందేలా తర్ఫీదునిస్తున్నందున విద్యార్థినీ, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ విద్యాసంవత్సరం నుంచి నూతనంగా బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్ ఉపాధి కోర్సును ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు జె హనుమంతరావు, పి రాజగోపాలబాబు, టి హరీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులను
కోఆప్షన్ సభ్యులుగా నియమించాలి

కావలి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): స్థానికసంస్థలైన పంచాయతీలు, మండల పరిషత్‌లు, మున్సిపాల్టీలలో దివ్యాంగులను కోఆప్షన్ సభ్యులుగా నియమించాలని అఖిల భారత దివ్యాంగుల హక్కుల వేదిక జాతీయ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. కావలి ఆర్డీవో కార్యాలయ ఆవరణలో ఆదివారం దివ్యాంగులతో సమావేశం నిర్వహించి వారి హక్కుల గురించి వివరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దివ్యాంగులను స్థానిక సంస్థలలో కోఆప్షన్ సభ్యులుగా నియమించకపోతే ఉద్యమం చేపట్టాల్సి వస్తుందన్నారు. అలాగే దివ్యాంగులకు నివేశన స్థలాలు ఇచ్చి ఇళ్లు కట్టించి ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో వేదిక నాయకులు మండవ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

గొడవ పడొద్దన్నందుకు దాడి

- పోలీసులకు ఫిర్యాదు

కొండాపురం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): గొడవ పడొద్దన్నందుకు షేక్ ఖాజామస్తాన్ అనే వ్యక్తి తనపై దాడిచేశాడని మండలంలోని కొమ్మి గ్రామానికి చెందిన మన్నవ వెంకటసుబ్బయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాలిలా ఉన్నాయి. ఆదివారం మధ్యాహ్నం గ్రామంలోని బ్రహ్మంగారి మఠంవద్ద గ్రామానికి చెందిన కె వీరాచారి, నజీర్, చిన్నబోయిన మహేంద్ర, షేక్ చాన్‌బాషా మరికొంతమందితో కలిసి మాట్లాడుకుంటుండగా షేక్ ఖాజామస్తాన్ అక్కడకు వచ్చి నజీర్ అనే వ్యక్తిని తిడుతుండగా ఎందుకు తిడుతున్నావని అడగ్గా కర్రతో దాడి చేశాడని, దీంతో అక్కడ ఉన్నవారు అతడిని మందలించి పంపించేశారు. దీంతో నీ అంతు చూస్తానని చెప్పి ఖాజామస్తాన్ అతని మోటారుసైకిల్‌ను తనే తగులబెట్టుకొని గ్రామస్థులను భయభ్రాంతులకు గురిచేశాడని, గ్రామంలో విచారించి న్యాయం చేయాలని బాధితుడు మన్నం వెంకటసుబ్బయ్య పోలీసులను కోరాడు.

ప్రభుత్వ బడిలో చేర్పించాలని ఉపాధ్యాయుడి ప్రచారం


విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇస్తున్న అల్లాబక్షు

అనంతసాగరం జూన్ 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆదర్శ ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల చేరిక కోసం ఆ పాఠశాల ఉపాధ్యాయుడైన దివ్యాంగుడు అల్లాబక్షు విశేషంగా కృషి చేస్తున్నారు. ప్రతి ఇంటికి వెళ్లి తమ పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించాలని, అన్ని వసతులతో కూడిన విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. వికలాంగుడైన అలాబక్షు చేస్తున్న కృషిని స్థానికులు అభినందిస్తున్నారు.

జూనియర్ లైన్‌మన్‌కు ఆర్థిక సాయం


మహేష్ తండ్రి శ్రీహరికి నగదు అందచేస్తున్న విశ్వబ్రాహ్మణులు

కొండాపురం, జూన్ 15 (ఆంధ్ర జ్యోతి): పార్లపల్లి సచివాలయ పరిధిలో జూనియర్ లైన్‌మన్‌గా పని చేస్తున్న బృగుమళ్ల మహేష్ విద్యుదాఘాతానికి గురై రెండు చేతులు కోల్పోయాడు. దీంతో విశ్వబ్రాహ్మణులు వైద్యఖర్చుల నిమిత్తం ఆదివారం రూ. 1,04,700 బాధితుని తండ్రి శ్రీహరికి అందచేశారు. ఈకార్యక్రమంలో టి బ్రహ్మానందాచారి, కంచర్ల కేశవాచారి, నారాయణాచారి, పరమేశ్వరాచారి, శానంపూడి నారాయణ, వెగ్గళం లక్ష్మీనరసయ్య, బాల బ్రాహ్మచారి తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్‌కు ఎమ్మెల్యే అభినందనలు


సాధించిన అవార్డులను ఎమ్మెల్యే కృష్ణారెడ్డికి చూపిస్తున్న రెడ్‌క్రాస్ బాధ్యులు

కావలి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కావలి రెడ్‌క్రాస్ 2023-24, 2024-25 సంవత్సరాలకు రక్తసేకరణలో ప్రతిభ కనబరచినందుకు రాష్ట్రస్థాయిలో 5 అవార్డులను అందుకున్న సందర్భంగా కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి అభినందించారు. ఆదివారం రెడ్‌క్రాస్ బాధ్యులు సాధించిన అవార్డులతో ఎమ్మెల్యేను కలిశారు. దీంతో ఆయన వారిని అభినందించారు. ఈకార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ డీ రవిప్రకాష్, వైస్ చైర్మన్ కే హరినారపరెడ్డి, కోశాధికారి ఆరికట్ల మధుసూధనరావు, ప్రణీత్, జీ రాజకుమార్‌చౌదరి, మోడరన్ నరసింహం తదితరులు పాల్గొన్నారు.

- **డాక్టర్ ప్రభాకర్ నాయుడి జన్మదిన వేడుకలు**

కావలి టౌన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : మాజీ మున్సిపల్ చైర్మన్, వైద్యరత్న బిరుదాంకితుడు డాక్టర్ ప్రభాకర్ నాయు డి జన్మదిన వేడుకలను ఆదివారం ఆయన అభిమానులు, మిత్రులు, స్వచ్ఛంద సంస్థలు ఆయన ఆసుపత్రి ఆవరణలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డితో పాటు ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ రబ్బాని, జనరల్ మెడిసిన్ దినేష్ రెడ్డి(అపోలో) పాల్గొన్నారు. అనతరం ఉచిత కంటి వైద్య శిబిరం ప్రారంభిం చారు. వివిధ పార్టీల నేతలు, ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాసంఘాలు, అభిమానులు ప్రభాకర్ నాయుడుకు శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ నేతలు మలిశెట్టి వెంకటేశ్వర్లు, గుత్తికొండ కిషోర్, ఎస్‌కె మస్తాన్, శ్రీహరినాయుడు, పోట్లూరు శ్రీనివాసులు, ఐఎంఏ వైద్యులు, రోటరీ క్లబ్, రెడ్‌క్రాస్ బాధ్యులు పాల్గొన్నారు.

రేపు పొగాకు రైతుల సదస్సు


పొగాకు రైతు సదస్సు కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రైతుసంఘం నాయకులు

కందుకూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ మంగళవారం కందుకూరులో పొగాకు రైతుల సదస్సు జరుగుతుందని, దీనిని జయప్రదం చేయాలని రైతుసంఘం నెల్లూరు జిల్లా సీనియర్ నాయకుడు ముప్పరాజు కోటయ్య కోరారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవన్‌లో పొగాకు రైతు సదస్సు కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కోటయ్య మాట్లాడుతూ రైతాంగం ఎన్నో వ్యయప్రయాసల కోర్చి పొగాకు సాగు చేయగా మార్కెట్లో లభిస్తున్న ధరలు తీవ్ర నిరాశపరిచాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈఏడాది పొగాకు రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయే పరిస్థితులు కనిపిస్తున్నందున ప్రభుత్వం తక్షణం వారిని ఆదుకునే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్య క్రమంలో రైతు సంఘం నాయకులు మాదాల రమణయ్య, జీ వెంకటేశ్వర్లు, ఎస్ ఏ గౌస్, వర్రబ్రహ్మకుమార్, డీఎం రాయుడు తదితరులు పాల్గొన్నారు.

'కొండ'ంత జనం



క్యూలో చిన్న పిల్లల అవస్థలు

కృష్ణతేజ సర్కిల్ నుంచి శిలాతోరణం వరకు క్యూలో వేచి ఉన్న భక్తులు

వేసవి సెలవుల తర్వాత స్కూళ్లు మొదలైన నేపథ్యంలో శ్రీవారి ఆశీస్సుల కోసం పిల్లలతో వచ్చే తల్లిదండ్రుల సంఖ్య అధికంగా ఉంది. ఈక్రమంలో శుక్ర, శనివారాల తరహాలో ఆదివారం కూడా తిరుమల క్షేత్రం కిటకిటలాడుతోంది. వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరి పార్కులోని షెడ్లు మొత్తం భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ సుమారు కిలోమీటరు మేరకు రింగురోడ్డులో వ్యాపించింది. భారీ పొడవైన క్యూలైన్లలో చిన్న పిల్లలు, వృద్ధులకు అవస్థలు తప్పలేదు. క్యూలైన్లలోని భక్తులు ఇబ్బందులు లేకుండా టీటీడీ నిరంతరాయంగా అన్నప్రసాదాలు, పాలు, మజ్జిగ అందజేసింది. రద్దీ కొనసాగుతున్నక్రమంలో శ్రీవారి ఆలయ ప్రాంతం, లేపాక్షి, రాంభగీచ కూడళ్లతో పాటు గదులు కేటాయించే కౌంటర్లు, కల్యాణకట్టలు, లడ్డూకేంద్రం, అఖిలాండం, యాత్రికులు వసతి సముదాయాలు, అన్నప్రసాద భవనాల్లో భక్తుల సందడి నెలకొంది. మరోవైపు తిరుగుప్రయాణ భక్తులతో బాలాజీ, రాంభగీచా ఆర్టీసీ బస్టాండ్లు రద్దీగా దర్శనమిచ్చాయి.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

వైభవంగా శ్రీహరి చక్రస్నానం

వడమాలపేట మండలం అప్పలాయగుంటలోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన ఆదివారం ఉదయం చక్రస్నానం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అంతకుముందు 9.15- 10.30 గంటల మధ్య శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరుడికి, చక్రత్తాళ్వార్‌కు పుష్కరిణి ఎదురుగా స్నపన తిరుమంజనం జరిగింది. రాత్రి 7- 7.30 గంటల మధ్య గరుడ పటాన్ని ధ్వజావరోహణం చేయడంతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి.


- వడమాలపేట, ఆంధ్రజ్యోతి



- కొవిడ్ టెస్ట్ కిట్లు తెచ్చుకోమని రోగులకు రాసిస్తున్న స్విమ్స్ వైద్యులు
- చీటీలు పట్టుకుని ఊరంతా తిరుగుతున్న రోగుల బంధువులు

కిట్లు ఎక్కడనుంచి తేవాలి?

తిరుపతి - ఆంధ్రజ్యోతి



నెల్లూరు సమీపంలోని కొత్తూరు నుంచి వెంకటస్వామి (56) చికిత్స కోసం శనివారం ఉదయం స్విమ్స్ ఆస్పత్రికి వచ్చారు. ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్న ఆయన కాలుకు ఇన్ఫెక్షన్‌తో పాటు కడుపు ఉబ్బరంగా ఉండడంతో కుమారుడు శ్రీకాంత్ స్విమ్స్‌కు తీసుకొచ్చారు. వైద్యులు పరీక్షించి క్యాజువాల్టీలో చేర్చుకున్నారు. అతడికి కొవిడ్ టెస్ట్ చేయాలని కిట్ బయట కొనుక్కొని రావాలని సిబ్బంది సాయంత్రం చీటీ రాసి శ్రీకాంత్‌కు ఇచ్చారు. ఆ చీటీతో ఆయన నగరంలోని ఎన్నో మెడికల్ షాపులకు తిరిగారు. ఎక్కడా కిట్ దొరక్కపోవడంతో స్విమ్స్‌కు తిరిగి వెళ్లారు.

ఇలా ఎందరో కొవిడ్ కిట్ల కోసం తిరుగుతున్నారు. కరోనా వైరస్ నిర్ధారణ కోసం ఆర్టీపీసీఆర్ పరీక్షను ప్రామాణికంగా తీసుకుంటారు. స్విమ్స్, రుయాస్పత్రుల్లో అనుమానం ఉన్న రోగులకు ఇవి చేస్తున్నారు కూడా. దీని ఫలితం వచ్చేందుకు ఆరేడు గంటల సమయం తీసుకుంటుంది కాబట్టి ర్యాపిడ్ యాంటిజెన్ టెస్ట్ కిట్స్ ద్వారా తాత్కాలిక నిర్ధారణ కోసం పరీక్షిస్తుంటారు. గతంలో వచ్చిన కొవిడ్ దశల్లో ర్యాపిడ్ టెస్ట్ కిట్లు ప్రైవేట్ మందుల షాపుల్లో దొరికేవి. ప్రస్తుతం కొవిడ్ వ్యాప్తి నేపథ్యంలో ర్యాపిడ్ కిట్లు ప్రైవేట్ సరఫరా లేదు. అదితెలియక స్విమ్స్ సిబ్బంది అనుమానిత రోగులకు ర్యాపిడ్ టెస్టు కిట్లు రాయడం వల్ల వాటికోసం అలిసిపోయేలా తిరగాల్సి వస్తోంది. ఇకనైనా కిట్లు అందుబాటులోకి వచ్చేవరకు స్విమ్స్‌లో చేసే ఆర్టీపీసీఆర్ పరీక్ష ద్వారానో, ప్రభుత్వం సరఫరా చేసే కిట్లనో వినియోగించాల్సి ఉంది.

ర్యాపిడ్ కిట్లు అందిస్తాం

అనుమానిత రోగులకు కొవిడ్ నిర్ధారణకు ఆర్టీపీసీఆర్ ద్వారా టెస్ట్ చేయాలి. ఒకవేళ అత్యవసరమనిస్తే ర్యాపిడ్ టెస్టు చేయాలి. ప్రస్తుతం ప్రైవేట్‌గా అవి అందుబాటులోకి రాలేదు. నేడో, రేపో 700 ర్యాపిడ్ టెస్టు కిట్లు ఆస్పత్రులకు పంపిణీ చేయనున్నాం. ఇటీవల కొవిడ్ వ్యాప్తి నేపథ్యంలో 16 మందికి పాజిటివ్ వచ్చింది. అయితే ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు లేవు. హోం ఐసొలేషన్ ద్వారానే తిరిగి నెగటివ్ వస్తోంది.

- బాలకృష్ణ నాయక్, డీఎంహెచ్‌వో





సెల్‌ఫోను టార్చ్ వెలుగులో వైద్యం అందిస్తున్న సిబ్బంది - అత్యవసర విభాగంలో సెల్‌ఫోన్ లైట్ వెలుతురులో సూపరింటెండెంట్ రమేష్ తదితరులు

చీకట్లో ప్రభుత్వాస్పత్రి

- జనరేటర్ పనిచేయక ఇబ్బందులు
- సెల్‌ఫోను టార్చ్ వెలుగులో వైద్య సేవలు

సూళ్లూరుపేట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రిలో చీకట్లో వైద్య సేవలు అందించాల్సి వచ్చింది. ఆస్పత్రిలోని జనరేటర్ పనిచేయకపోవడంతో ఈ సమస్య నెలకొంది. ఆదివారం ఉదయం సూళ్లూరుపేట పట్టణం, మండలంలోని మన్నారుపోలూరు, మంగానెల్లూరు సబ్ స్టేషన్లలో మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని అధికారులు ప్రకటించారు. మరమ్మతులు ఆలస్యం కావడంతో విద్యుత్ సరఫరాను రాత్రి 8 గంటలకు పునరుద్ధరించారు. పగలంతా వెలుతురు ఉండటంతో పెద్దగా ఇబ్బంది తలెత్తలేదు. కానీ, సాయంత్రం 6 గంటకు చీకటి పడడంతో ప్రభుత్వాస్పత్రిలోని అత్యసర విభాగంలో రోగులకు వైద్య సేవలు అందించేందుకు వైద్యులు ఇబ్బంది పడ్డారు. రోగుల బంధువుల సెల్‌ఫోన్ల టార్చిలైట్ల వెలుతురులోనే వైద్యం అందించారు. జనరేటర్ పనిచేయక పోవడంతో ఉదయం నుంచి ఆస్పత్రిలోని ఆయా వార్డుల్లో ఉన్న రోగులు ఇబ్బంది పడ్డారు. విద్యుత్‌కు అంతరాయం కలిగినప్పుడల్లా రోగులకు అవస్థలు తప్పడంలేదు. ఆపరేషన్ చేసే సమయంలో కరెంట్ పోతే అంతే సంగతులు. ఇక, 12 గంటల పాటు విద్యుత్ సరఫరా లేకపోవడంతో సూళ్లూరుపేట పట్టణం, మండలంలోని మన్నారుపోలూరు, దామానెల్లూరు, ఉచ్చూరు, ఇలుపూరు, మంగళంపాడు, మంగానెల్లూరు గ్రామాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

నేడు కేంద్రమంత్రిచే క్రిస్‌సిటీ ఏరియల్ సర్వే



సెంట్రల్ మినిస్టర్- విమానాశ్రయంలో కేంద్ర మంత్రి గోయల్

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 2,500 ఎకరాల్లో చేపట్టిన కృష్ణపట్నం ఇండస్ట్రియల్ నోడ్ (క్రిస్ సిటీ) పనులను కేంద్ర వాణిజ్య, పరిశ్రమలశాఖ మంత్రి పియూష్‌గోయల్ సోమవారం ఉదయం హెలిక్యాప్టర్‌లో ఏరియల్ సర్వే నిర్వహించనున్నారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, కలెక్టర్ వెంకటేశ్వర్ కేంద్ర మంత్రితో కలిసి రేణిగుంట విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి క్రిస్‌సిటీ ఏరియల్ సర్వేలో పాల్గొంటారు. క్రిస్‌సిటీ అభివృద్ధికి కేంద్రం నుంచి రావాల్సిన నిధులపై జిల్లా అధికారులతో కేంద్రమంత్రి చర్చించనున్నట్లు తెలిసింది. ఇప్పటికే రూ.200 కోట్లకుపైగా జరిగిన క్రిస్‌సిటీ పనులపైనా ఆయన సమీక్షించనున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకుగాను కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ ఆదివారం రాత్రి విమానాశ్రయానికి చేరుకోగా.. రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్, కలెక్టర్ వెంకటేశ్వర్, టీటీడీ సభ్యుడు భానుప్రకాష్, బీజేపీ నేతలు స్వాగతం పలికారు. తిరుమలకు వెళ్లిన కేంద్ర మంత్రి సోమవారం ఉదయం శ్రీవారిని దర్శించుకుని, ఏరియల్ సర్వేలో పాల్గొననున్నారు.

విశాఖ యోగా సంగమ నిర్వహణకు ఇద్దరు ఎమ్మెల్యేలకు పిలుపు



రైలులో బయల్దేరిన ఎమ్మెల్యేలు అమర్, నాని

తిరుపతి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): విశాఖలో ఈనెల 21న జరిగే 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగా సంగమం కార్యక్రమ నిర్వహణ కోసం ఉమ్మడి చిత్తూరుజిల్లా నుంచి ఇద్దరు ఎమ్మెల్యేలకు పిలుపు వచ్చింది. విశాఖలో 21న ప్రధాని నరేంద్రమోదీ పాల్గొనే ఈ కార్యక్రమంలో 40 దేశాలకు చెందిన ప్రతినిధులతో పాటు 5లక్షల మంది ప్రజలు పాల్గొంటారని అంచనా. యోగా సంగమం విశాఖలో జరుగుతుండడం, దేశప్రధాని స్వయంగా పాల్గొంటున్న కారణంగా ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా పరిగణిస్తోంది. దానికి అనుగుణంగా ఏర్పాట్లు చేస్తోంది. అందులో భాగంగా యోగా సంగమం నిర్వహణకు రాష్ట్రవ్యాప్తంగా 15మంది ఎమ్మెల్యేలకు సీఎం చంద్రబాబు నుంచి పిలుపు అందింది. ఈ కార్యక్రమ నిర్వహణలో కీలక బాధ్యతలను వారికి అప్పగించనున్నట్లు సమాచారం. ఆ 15మందిలో ఉమ్మడి జిల్లా నుంచి పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ఉన్నారు. వీరిద్దరూ ఆదివారం సాయంత్రం తిరుపతి నుంచి రైల్లో విశాఖకు బయల్దేరి వెళ్లారు. వారికి ఏ బాధ్యతలు అప్పగించేది సోమవారం తెలియనుంది.

మంత్రి ఆదేశించినా.. మామిడి రైతుకు మద్దతేదీ?

- రూ.6కి మించి ఇవ్వలేమంటున్న యాజమాన్యాలు
- కాదంటే ఫ్యాక్టరీలు మూసేయడానికి సిద్ధమంటున్న వైనం

చిత్తూరు సెంట్రల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఎన్ని చర్యలు చేపట్టినా మామిడి రైతుకు మద్దతు ధర లభించడంలేదు. మద్దతు ధర రూ.12గా ప్రకటించిన ప్రభుత్వం రూ.4 రాయితీ ఇస్తోంది. ఫ్యాక్టరీలను రూ.8 ఇవ్వాలని చెప్పింది. ఈ మేరకు శనివారం తిరుపతి జిల్లా పాకాల, చిత్తూరులో పర్యటించిన మంత్రి అచ్చెన్నాయుడు యాజామాన్యాలను ఆదేశించారు. దీంతో ఆదివారం నుంచి మద్దతు ధర లభిస్తుందని రైతులు ఆశించినా.. యాజమాన్యాలు రూ.6కి మించి ఇవ్వలేమంటూ స్పష్టంచేశాయి. అంతకుమించి ఇవ్వాలంటే ఫ్యాక్టరీలు మూసేయడానికి సిద్ధమని పేర్కొంటున్నాయి. ప్రభుత్వ ఆదేశాలను గౌరవిస్తామని, అయితే నష్టానికి వ్యాపారాలు చేయలేమంటున్నాయి. 'గతేడాదికి సంబంధించి 2.50 లక్షల టన్నుల పల్ప్ నిల్వలు ఉన్నాయని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు. ఇందులో 50 టన్నులు చెడిపోగా, లక్ష టన్నుల వరకు ఇంకా నిల్వ ఉంది. ఈ పరిస్థితుల్లో తోతాపురి కిలోకు రూ.8 ఇవ్వాలంటే తాము నష్టపోతామంటున్నాయి. మద్దతు ధర లభించక పోవడంతో పక్వానికి వచ్చిన కాయలు తోటల్లోనే రాలిపోతున్నాయి. మరోవైపు ఫ్యాక్టరీల వద్దకు తీసుకొచ్చిన కాయలను రూ.6కి ఇవ్వాలా వద్దా అని ఇంకొందరు రైతులు తర్జనభర్జన పడుతున్నారు.



నేడు పీజీఆర్ఎస్

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 15(ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టరేట్, రెవెన్యూ డివిజన్.. మండల కేంద్రాల్లో సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదివారం ఓ ప్రకటనతో కోరారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు అధికారులు అర్జీలను స్వీకరిస్తారని పేర్కొన్నారు. అర్జీదారులు తమ అర్జీలను వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చని సూచించారు. నమోదైన అర్జీల స్థితికి సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100కు నేరుగా కాల్ చేయొచ్చని తెలిపారు.

నిషేధం ముగిసినా.. వేటకు అంతరాయం

- సముద్రంలో అలల ఉధృతితో ఆగిన మత్స్యకారులు
- సాయంత్రం వెళ్లిన కొన్ని పడవలు

కోట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): సముద్ర వేటకు 61 రోజుల నిషేధం ముగిసింది. ఇక, ఆదివారం చేపలు పట్టేందుకు సముద్రంలోకి వెళ్లేందుకు సిద్ధమైన మత్స్యకారులకు అలల రూపంలో ఆటంకం ఎదురైంది. దీంతో సాయంత్రానికి కొందరు మాత్రమే బోట్లలో వెళ్లారు. సముద్రంలో చేపలు గుడ్లు పెట్టడం, సంతానోత్పత్తి సందర్భంగా మత్స్యశాఖ అధికారులు కోట, వాకాడు, చిల్లకూరు మండలాల్లోని మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లకుండా నిషేధం విధించారు. ఆంక్షల సమయంలో మత్స్యకారులు అతిక్రమించి చేపల వేటకు వెళ్తారన్న సముద్రంలో ఎప్పటికప్పుడు మత్స్యశాఖ పర్యవేక్షిస్తూ వచ్చింది. ఈ రెండు నెలల కాలంలో అరకొరతప్ప పలువురు సముద్రంలో చేపలవేటకు వెళ్లే మత్స్యకార కుటుంబాలు పస్తులతో గడపాల్సి వచ్చింది. సముద్రంలో చేపల వేట నిషేధ గడువు ముగియడంతో ఆయా మండలాల్లోని మత్స్యకారులు ఆదివారం ఉదయం బోట్లు, పడవలతో సముద్రంలో వెళ్లారు. అయితే, తెల్లవారుజాము నుంచే సముద్రంలో విపరీతమైన గాలులు, అలజడులు ఉండటంతో వేటకు వెళ్లలేక వెనుదిరిగారు. కోట మండలం శ్రీనివాసపురం, గోవిందపల్లిపాళెం ముఖద్వారాల నుంచి మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లలేకపోయారు. భయంకరమైన అలలు, విపరీతమైన గాలులు వీస్తుండటంతో ఎక్కడ బోట్‌లు కొట్టుకుపోతాయోనని భయాందోళనకు గురై సముద్రం వద్దకెళ్లి కొంతమంది బోట్లను ముఖద్వారం వద్దకు తీసుకువచ్చారు. అయితే బాగా పొద్దుపోయేదాక 180 బోట్లకుగాను కేవలం మూడు మాత్రమే అలలు, గాలులకు లెక్క చేయకుండా సముద్రంలోకి వెళ్లినట్లు మత్స్యకారులు తెలిపారు. ఇక, చిల్లకూరు మండలం తమ్మినపట్నం, గుమ్మళ్లదిబ్బ ముఖద్వారాల నుంచి బోట్లు వెళ్లలేదు. వాకాడు మండలం కొండూరుపాలెం, తూపిలిపాలెం నుంచి అరకొరగా బోట్లు వెళ్లినట్లు సమాచారం. కాగా, సోమవారం నుంచి యధావిధిగా సముద్రంలో వేటసాగే అవకాశాలు ఉన్నాయని మత్స్యకారులు చెబుతున్నారు.



కోట మండలం గోవిందపల్లిపాళెం ముఖద్వారం నుంచి సముద్రంలోకి వెళ్తున్న బోట్

చినుకు పడితే చెరువుల్లా రోడ్లు



ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయ రోడ్డులో వర్షపునీరు

సూళ్లూరుపేట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మున్సిపాలిటీలో సిమెంటు రోడ్లపై చినుకు పడితే చాలు వర్షపునీరు నిలబడిపోతుంది. ఆ రోడ్లపై ద్విచక్ర వాహనదారులు, పాదచారులు వెళ్లాలంటే సాహసం చేయాల్సి వస్తోంది. జీఎస్ రోడ్డు నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లే దారిలో చిన్నపాటి వర్షమొచ్చిన నీరుబడిపోతోంది. పక్కనే మురుగుకాలువ ఉన్నా సిమెంటు రోడ్డు తక్కువ ఎత్తులో ఉండడంతో వర్షమొచ్చినప్పుడు నీళ్లు పారకుండా అలాగే ఉండి పోతున్నాయి. అదే విధంగా ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం వద్ద వేసిన సిమెంటు రోడ్డులో కూడా ఇదే పరిస్థితి. మన్నారుపోలూరు సచివాలయానికి వెళ్లే రోడ్డు చిన్నపాటి వర్షమొచ్చినా అధ్వానంగా మారుతోంది. మున్సిపాలిటటీ అధికారులు స్పందించి సిమెంటు రోడ్లపై వర్షపునీరు నిలబడకుండా చూడాల్సిన అవసరం ఉంది.

పేదరిక నిర్మూలనే చంద్రబాబు లక్ష్యం: కురుగొండ్ల



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, జూన్ 15:(ఆంధ్రజ్యోతి) పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పనిచేస్తున్నట్లు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. ఆదివారం పట్టణంలోని పింజలి వీరయ్య కల్యాణ మండపంలో జరిగిన గాండ్ల, తెలికుల ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 2024-2025 విద్యా సంవత్సరంలో 10వ తరగతిలో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరికం లేని రాష్ట్రంగా తీర్చి దిద్దాలన్న సంకల్పంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కుల సంఘ రాష్ట్ర అధ్యక్షులు వాకాటి హరికృష్ణ, రామిశట్టి నారాయణ, సభ్యులు బికే ప్రసాద్, నవీన్ చంద్రశేకర్, జాన్సీ రాణి, నాగరాజు తదితరులు ఉన్నారు.

తల్లికి వందనంతో తల్లుల్లో ఆనందం



సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న టీడీపీ నాయకులు

పెళ్లకూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు తల్లికి వందనం పథకం అమలు చేయడంతో విద్యార్థుల తల్లుల్లో ఆనందం వెల్లువిరుస్తోందని టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య అన్నారు. ఆదివారం మండలంలోని పునబాక గ్రామంలో సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ చిత్రపటాలకు లబ్ధిదారులు, టీడీపీ నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న విద్యార్థులు ఒక కుటుంబంలో ఎందరున్నా తల్లికి వందనం పథకం ద్వారా నగదు అందించడంతో చదువులకు ఎలాంటి ఆటకం లేకుండా కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో స్వర్ణముఖినది ఆనకట్ట ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ దామెర ప్రసాద్‌నాయుడు, నాయకులు వేలూరు హరినాయుడు, తాళ్ల యుగంధర్‌గౌడ్, పునబాక పోలయ్య, జనసేన నాయకుడు తాళ్లరెడ్డి శ్రీనివాస్, మాదుపూరు మురళీనాయుడు, సుమన్‌రెడ్డి, కన్నలి విజయ భాస్కర్, కుమార్‌గాంధి, పరుశురామ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై శిక్షణ



ఫ్యాకల్టీ అభివృద్ధి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ రవిప్రసాద్

గూడూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం అటల్ ఫ్యాకల్టీ అభివృద్ధి కార్యక్రమం జరిగింది. ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగంలోని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై అధ్యాపకులకు శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ రవిప్రసాద్ మాట్లాడుతూ అధ్యాపకుల్లో నైపుణ్యాలను పెంపొందించేందుకు అటల్ ఫ్యాకల్టీ అభివృద్ధి కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులను అధ్యాపకులకు వివరించడం జరుగుతుందని, దీంతో అధ్యాపకులు విద్యార్థులకు సులభతరంగా అర్థమయ్యేలా బోధన అందించేందుకు వీలుంటుందన్నారు. కార్యక్రమంలో దత్తాత్రేయ శర్మ, విశ్వక్సేనారెడ్డి, కొండారెడ్డి, వాసుదేవరెడ్డి, హరికిషోర్ తదితరులు పాల్గొన్నారు.

తూపిలిపాళెం తీరంలో పర్యాటకుల సందడి



వాకాడు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూపిలిపాళెం సముద్ర తీరంలో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. ఆదివారం సెలవు కావడంతో పిల్లలు, యువతతో పాటు పెద్దలు సముద్రతీరానికి వచ్చి సరదాగా గడిపారు. వందల సంఖ్యలో పర్యాటకులు రావడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ముత్యాలమ్మకు పూజలు

చిల్లకూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పు కనుపూరు గ్రామంలో వెలసిన ముత్యాలమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టుకుని నైవేద్యం నివేదించారు. ఆలయం ఎదుట ఉన్న త్రిశూలం వద్ద టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

ఆటో డ్రైవర్ ఆత్మహత్య

కోట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కేశవరం పంచాయతీ కొండుగుంటలో నివాసం ఉంటున్న మద్దినేని నాగరాజు (40) ఉరివేసుకొని మృతి చెందినట్లు ఎస్ఐ పవన్‌కుమార్ ఆదివారం తెలిపారు. కావలికి చెందిన నాగరాజు కొండుగుంటలోని అత్తగారి ఇంట్లో ఉంటూ ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆదివారం భార్యతో గొడవపడిన నాగరాజు ఇంట్లో ఇనుప రాడ్‌కు తాడుతో ఉరివేసుకొని అపస్మారకస్థితికి చేరుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

డివైడర్‌ను ఢీకొన్న లారీ

నాయుడుపేట టౌన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - చెన్నై రహదారి సమీపంలో లారీ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. ఆదివారం తెల్లవారుజామున జరిగిన ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

ప్రభుత్వ పాఠశాలలకు ప్రహరీ నిర్మించండి



ప్రహరీ లేని శంకరన్ గిరిజనకాలనీ, దళితవాడలోని ప్రాథమిక పాఠశాలలు

చిల్లకూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలకు ప్రహరీ లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక శంకరన్ గిరిజనకాలనీ, దళితడవాడ, ఉడతావారి పార్లపల్లి, చేడిమాల తదితర గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలకు ప్రహరీలు లేవు. దీంతో పాఠశాలల్లోకి పశువులు, కుక్కలు ప్రవేశించడంతో అపరిశుభ్ర వాతావరణం నెలకొంటోంది. శంకరన్ గిరిజకాలనీ, దళితవాడలోని పాఠశాలల సమీపంలో చుట్టూ ముళ్లచెట్లు పెరిగిపోయాయి. దీంతో పాఠశాలల్లోనికి విషసర్పాలు ప్రవేశిస్తున్నాయని విద్యార్థులు, ఉపాధ్యాయులు భయాందోళన చెందుతున్నారు. అంతేకాకుండా ప్రహరీలు లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి పాఠశాలలకు ప్రహరీ నిర్మాణాలు చేపట్టాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

హామీలన్నీ చిత్తశుద్ధితో అమలు: పాశం



మల్లాంలో సిమెంట్ రోడ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్, టీడీపీ మండల అధ్యక్షుడు గణపర్తి కిషోర్ నాయుడు

చిట్టమూరు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలన్నీ చిత్తశుద్ధితో అమలు చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చర్యలు తీసుకుంటున్నారని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలను ఆయన పాల్గొని ప్రారంభించారు. మల్లాంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తూ సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. ఓర్వలేని వైసీపీ నాయకులకు మంత్రి నారా లోకేశ్‌పై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తల్లికి వందనం పథకంలో ప్రతి బిడ్డకూ నగదు వేసిన ఘనత బాబుకే దక్కిందన్నారు. కాగా, తాడిమేడు గ్రామంలో రూ.10 లక్షలు, కోగిలిలో రూ.10 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్లను ఆయన ప్రారంభించారు. మల్లాంలో రూ.21.80 లక్షలతో నిర్మించిన రైతు సేవా కేంద్రం, రూ.43.60 లక్షలతో నిర్మించిన సచివాలయం భవనం, రూ.20 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. యల్లసిరిలో రూ.15 లక్షలతో వేసిన మెటల్ రోడ్డు, యాకసిరి గ్రామంలో ఆర్‌డీఎస్ నిధులు రూ.2.50 కోట్లతో ఎస్డీసీఎల్ పనులు, రూ.5 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. తాడిమేడు గ్రామంలో సిమెంట్ రోడ్లకు అదనంగా మరో రూ.15 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. మాజీ ఎంపీపీ ఉక్కు జనార్దన్ కోరిక మేరకు కొత్తగుంట నుంచి ఆరూరు వరకు వచ్చే డొంక అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో మనోహర్ గౌడ్, తహసీల్దారు సతీష్ కుమార్, సీఐ హుస్సేన్ బాషా, టీడీపీ మండల అధ్యక్షుడు గణపర్తి కిషోర్ నాయుడు, నాయకులు కామిరెడ్డి సునీల్‌రెడ్డి, దువ్వూరు భారతమ్మ, మునిశేఖర్ రెడ్డి, మస్తాన్‌రెడ్డి, జనార్దనరెడ్డి, ధనంజయ్య నాయుడు, హరికృష్ణారెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు శరత్‌రెడ్డి, రాజేష్‌రెడ్డి, సుందరయ్య, వెంకటరమణయ్య, చెంచురామయ్య ఆచారి, చిన్నారావు, బషీర్, మణి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ అసత్య ప్రచారాలు మానుకోవాలి: విజయశ్రీ



తల్లులు, విద్యార్థులతో కలిసి కేక్‌కట్ చేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, పక్కన టీడీపీ నాయకులు ఆకుతోట, మాధవ నాయుడు

సూళ్లూరుపేట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అసత్య ప్రచారాలు మానుకోవాలని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. ఆదివారం సూళ్లూరుపేటలోని క్యాంప్ కార్యాలయంలో ఆమె టీడీపీ నాయకులతో కలిసి మీడియాతో మాట్లాడారు. సీఎం చంద్రబాబు సూపర్ సిక్స్ హామీలో భాగంగా తల్లికి వందనం పథకం కింద తల్లుల ఖాతాల్లో నగదు జమ చేశారని చెప్పారు. ఒక ఇంట్లో ఎంత మంది అర్హులున్నా అందరికీ తల్లికి వందనం వర్తింపజేశారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం అర్హులందరికీ నగదు జమ చేయడంతో రాష్ట్రమంతా పండగ వాతావరణం నెలకొని ఉంటే వైసీపీ అసత్య ప్రచారాలు చేస్తోందన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తల్లి వందనం పథకంలో అవినీతి జరిగిందని ఆరోపించడం సిగ్గుచేటన్నారు. ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చుతుంటే ఏమి చేయలేదని చెప్పడం తగదన్నారు. వైసీపీ విమర్శలు మాని అభివృద్ధికి సహకరించాలని హితువు పలికారు. అనంతరం తల్లికి వందనం లబ్ధిపొందిన తల్లులు, పిల్లలతో కలిసి కేక్ కట్‌చేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుతోట రమేష్, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవ నాయుడు, నాయకులు చిట్టేటి పెరుమాల్, కొక్కు శంకరయ్య, పాకం వెంకట సుబ్బయ్య, కరకంబేటి సుబ్రహ్మణ్యం, సంచి కృష్ణయ్య, విజయ నాయుడు, రాజసులోచనమ్మ తదితరులు పాల్గొన్నారు.

గడ్డిమందు తాగి యువకుడి మృతి



మృతి చెందిన బాలసుబ్రహ్మణ్యం

దొరవారిసత్రం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం వేణుంబాక దళితవాడకు చెందిన బాలసుబ్రహ్మణ్యం(23) గడ్డిమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న బాలసుబ్రహ్మణ్యం ఈ నెల 11న గడ్డి మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. కుటుంబ సభ్యులు చెన్నైలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు.

అట్రాసిటీ కేసు విచారణ

చిట్టమూరు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెద్ద దరఖాస్తు గ్రామంలో అట్రాసిటీ కేసును డీఎస్పీ గీతా కుమారి విచారించారు. ఈనెల 9న కోటపూరి తిరుపాలయ్యను అదే గ్రామానికి చెందిన మల్లీశ్వరమ్మ కౌలు లీజు విషయంలో కులం పేరుతో దూషించినట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో సాక్షులను ఆదివారం డీఎస్పీ విచారించారు. కార్యక్రమంలో ఎస్ఐ చిన్న బలరామయ్య, వీఆర్వో కోటయ్య పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

నాయుడుపేట టౌన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - శ్రీకాళహస్తి బైపాస్‌రోడ్డు సమీపంలో అక్రమంగా నిల్వచేసి ఉన్న 50 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఇందుకు సంబంధించి సురేష్, పవన్, దయాకర్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

కోట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కోట మండలం తిన్నెలపూడిలోని గమళ్లపాళెం పొలాల వద్ద ఆదివారం తెల్లవారుజామున 25 ఏళ్ల యువకుడు విద్యుదాఘాతానికి గురై మృతి చెంది ఉండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ పవన్‌కుమార్ వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేపట్టారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ పవన్‌కుమార్

గంగమ్మకు ప్రత్యేక పూజలు



గంగమ్మ పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, తానంకి నానాజీ తదితరులు

చిల్లకూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చిల్లకూరు గొల్లపాళెంలోని గంగమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న కొలుపులో భాగంగా ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయంలో మహిళలు సామూహికంగా అంబలి తీసుకువచ్చి అమ్మవారికి జరిపారు. ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, టీడీపీ సీనియర్ నాయకులు తానంకి నానాజీ అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో చిల్లకూరు పట్టాభిరామిరెడ్డి, కొండా రామచంద్రారెడ్డి, దాసరి రాము తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

వెంకటగిరి, జూన్ 15:(ఆంధ్రజ్యోతి) పట్టణంలోని తోలిమిట్టకు చెందిన లక్ష్మమ్మ క్యాన్సర్‌తో బాధపడుతోంది. శ్రీకృష్ణదేవరాయ కాపు, బలిజ, తెలగ ట్రస్టు నిర్వాహకులు లక్ష్మమ్మ వైద్యఖర్చుల నిమిత్తం రూ.5వేల అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు తోట కృష్ణయ్య, బీరం రాజేశ్వరరావు, గొల్లగుంట రాము, చింతకాయల మహేష్, కందాల తిరుపాల్, పసుపులేటి విజయకుమార్, వెంకటరమణ, అపర్ణ, శిరిషా తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారికి లక్ష తులసీపూజ



వెంకటేశ్వరస్వామికి లక్షతులసీపూజ నిర్వహిస్తున్న భక్తులు

గూడూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాజావీధిలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఉదయం స్వామి, అమ్మవార్లకు వైభవంగా లక్ష తులసీపూజ, పుష్పయాగోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్నప్రసాదాల వితరణ జరిగింది. రాత్రి ద్వాదశారాధనం జరిపారు. ఈ పూజా కార్యక్రమాల్లో ఉత్సవ కమిటీ చైర్మన్, శ్రీకంటి రామమోహన్‌రావు, ఈవో రవికృష్ణ, ఉభయదాత తలమంచి సిద్దారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

అన్ని పాఠశాలలకు పుస్తకాల సరఫరా

ఓజిలి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని పాఠశాలలకు పుస్తకాలను సరఫరా చేసినట్లు ఎంఈవో చంద్రశేఖర్ తెలిపారు. విద్యాసంవత్సరం ప్రారంభం నుంచే విద్యార్థులకు అందజేయాలనే ధ్యేయంతో పాఠశాలలకు సరఫరా చేశామని, ప్రధానోపాధ్యాయుల ద్వారా విద్యార్థులకు వాటి అందించేలా చర్యలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు. అలాగే స్థానిక నాయకుల సహకారంతో కూడా పుస్తకాలు, కిట్లను అదజేసినట్లు ఎంఈవో తెలిపారు.

వృద్ధుల పట్ల గౌరవంగా నడుచుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్జి వెంకటనాగ పవన్

గూడూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రతి ఒక్కరూ వృద్ధుల పట్ల గౌరవంగా మెలగాలని ఏడవ అదనపు జిల్లా జడ్జి వెంకటనాగ పవన్ అన్నారు. ఆదివారం మండలంలోని పోటుపాళెం గ్రామంలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ వృద్ధుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధుల పట్ల అమర్యాదగా ప్రవర్తించడం, వారికి కల్పించిన చట్టాలను దుర్వినియోగం చేయడం, వేధింపులకు గురిచేయడం చట్టరీత్యా నేరమన్నారు. వృద్ధుల పట్ల మర్యాదపూర్వకంగా నడుకుంటూ వారిని నిర్లక్ష్యం చేయకుండా తగిన సాయం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తి రాజేష్, ఎస్ఐ మనోజ్‌కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

వృద్ధుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలి

తడ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): వృద్ధులపట్ల ప్రతి ఒకరూ బాధ్యతగా వ్యవహరించాలని సూళ్లూరుపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సంయుక్త అన్నారు. ఆదివారం మండల పరిధిలోని కారిజాత గ్రామంలో లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. న్యాయమూర్తి సంయుక్త మాట్లాడుతూ చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. న్యాయవాదులు తిరుమూరు సుధాకర్‌రెడ్డి, ధర్మప్రసాద్, చలపతి, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి కబడ్డీపోటీలకు విద్యార్థినుల ఎంపిక



విద్యార్థినులను అభినందిస్తున్న హెచ్‌ఎం మాధవీలక్ష్మి, పీడీ విజయలక్ష్మి

గూడూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు ఎంపికయ్యారని హెచ్‌ఎం మాధవీలక్ష్మి తెలిపారు. ఈనెల 12వ తేదీన అమ్యాచ్యూర్ కబడ్డీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కాకినాడలో నిర్వహించిన జాతీయస్థాయి కబడ్డీ జట్టు ఎంపిక పోటీల్లో తమ పాఠశాలకు చెందిన విద్యార్థినులు దీపిక, కౌసల్య ప్రతిభచారని చెప్పారు. వీరు జూలై 10నుంచి 13వ తేదీ వరకు రాజస్థాన్‌లో జరగనున్న జాతీయస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఆదివారం పాఠశాలలో విద్యార్థినులను హెచ్‌ఎం మాధవీలక్ష్మి అభినందించారు. కార్యక్రమంలో పీడీ విజయలక్ష్మి, మ్యాజిక్ బస్ ఫౌండేషన్ ప్రతినిధి లత తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి ఫుట్‌బాల్ టోర్నీ విజేత తిరుపతి

నాయుడుపేట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట ఏఎల్‌సీఎం క్రీడా ప్రాంగణంలో జిల్లాస్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్ నిర్వహించారు. అండర్-17 విభాగంలో తిరుపతి టీమ్ విన్నర్‌గా, రేణిగుంట టీమ్ రన్నర్‌గా నిలిచాయి. ఆదివారం రాత్రి సీఐ బాబి, కోచ్ షేక్ గౌస్‌బాషా, ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రెడ్డెప్ప ట్రోఫీ అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఏఎల్‌సీ చర్చి సభ్యులు కళాచంద్, భావన్, సుమన్, భాను, మధు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు కూరగాయలు, కోడిగుడ్లు పంపిణీ

గూడూరు అర్బన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఆదివారం జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో దశరధరామిరెడ్డి దాతృత్వంతో దివ్యాంగులకు కూరగాయలు, కోడిగుడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జేవీవీ పట్టణాధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్, నాగరాజు, పురుషోత్తమరావు, సుబ్బారావు, ప్రభాకర్, ఇబ్రహీం, అశోక్, రాధయ్య, రజనీకాంత్, సుధీర్, శ్రీనివాసాచారి, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి నారాయణకు టీడీపీ నేతల శుభాకాంక్షలు



మంత్రి నారాయణకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్న జిల్లా తెలుగుయువత ఉపాధ్యక్షుడు పరసా రాజా

నాయుడుపేట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ శాఖామంత్రి పొంగూరు నారాయణకు నాయుడుపేట టీడీపీ నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం నెల్లూరులో మంత్రి నారాయణను కలిసిన తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షుడు పరసా రాజా, నెల్లూరు జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు పనబాక భూలక్ష్మి, టీడీపీ లీగల్ సెల్ న్యాయవాది పనబాక గంగబాబు తదితరులు శాలువాలు, పుష్పగుచ్ఛాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

టీడీపీ నేత కుటుంబానికి పరామర్శ

చిట్టమూరు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): టీడీపీ నేత, చిట్టమూరు జీఎం నాయుడు ఉన్నత పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ బద్దిగ నారాయణ ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులను ఆదివారం గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ పరామర్శించారు. ప్రముఖ పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్ సూచన మేరకు రూ.లక్ష నారాయణ కుటుంబ సభ్యులకు అందజేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఆయన వెంట టీడీపీ మండల అధ్యక్షుడు గణపర్తి కిషోర్ నాయుడుకు, మాజీ జడ్పీటీసీ భారతమ్మ, జనార్దనరెడ్డి, రాజేష్‌రెడ్డి, చెంచురామయ్య ఆచారి ఉన్నారు.